Follow: @ANNTELUGU

28-03-2025

ANN తెలుగు

# మహా పత్రిక

శుక్రవారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 116 పేజీలు-08 వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## టాప్ న్యూస్

### మల్లారెడ్డినా మజాకా..

- మేడ్చల్ నియోజకవర్గాన్ని జీహెచ్ఎంసీలో కలపొద్దని మంత్రి శ్రీధర్ బాబుకు వినతి
- అసెంబ్లీలో నవ్వులే.. నవ్వులు

03



### బైరెడ్డి సిద్దార్థకు కీలక బాధ్యతలు

- యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా నియామకం
- జగన్ సంచలన నిర్ణయం

03



### రేవంత్ రెడ్డి చేతల్లో చూపించారు

- తమిళనాడు సీఎం స్టాలిన్ ప్రశంసలు
- తెలంగాణ అసెంబ్లీ తీర్మానం ఓ మైలురాయి

02



# జైల్లో డబుల్ బెడ్ రూం హామీ నెరవేర్చలేదు

- తెలంగాణ అసెంబ్లీలో రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు
- రుణమాఫీ, రైతు సంక్షేమంపై సీఎం కీలక ప్రకటనలు
- తెలంగాణ ఆర్థిక స్థితిగతులపై ముఖ్యమంత్రి వివరణ

అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి మరోసారి కేసీఆర్ కుటుంబంపై కీలక వ్యాఖ్యలు చేశారు. తాను ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా ప్రతీకార చర్యలకు పాల్పడుతున్నారంటూ ప్రతిపక్ష నేతలు చేసిన ఆరోపణలకు సమాధానం ఇచ్చే క్రమంలో రేవంత్ రెడ్డి భావోద్వేగానికి లోనయ్యారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తనను నిర్దాక్షిణ్యంగా అరెస్టు చేసి తన కూతురి పెళ్లికి కూడా వెళ్లకుండా చేశారని.. 16 రోజులు నిద్రలేని రాత్రులు గడిపానంటూ సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఈ క్రమంలో మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కుటుంబంపై తనదైన శైలిలో రేవంత్ రెడ్డి విరుచుకుపడ్డారు. ఈ సందర్భంగా తాను ఎన్నికల్లో ఇచ్చిన ఓ హామీని అమలు చేయలేదని అసెంబ్లీ సాక్షిగా రేవంత్ రెడ్డి ఒప్పుకున్నారు. "నేను కక్ష సాధింపునకు పాల్పడితే మీ కుటుంబం అంతా చంచల్‌గూడలో ఉండేవారు. ఎంపీగా ఉన్న నన్ను ఆరోజు చర్లపల్లి జైలుకు పంపారు. బిడ్డ పెండ్లి పత్రిక పెట్టుకునేందుకు కూడా పంపకపోతే సుప్రీం కోర్టు లాయర్ల ద్వారా కండీషన్ బెయిల్ తెచ్చుకున్నా ఎన్ కన్వెన్షన్‌లో పెండ్లి పత్రిక రాసుకుని అక్కడి నుంచి నేరుగా చంచల్‌గూడా జైలుకే వెళ్లా అని ఇన్నారు. - మహా

02






# తెలంగాణలో అసెంబ్లీ సీట్లు ఎందుకు పెంచలేదు?

**సిక్కిం, కాశ్మీర్‌లో ఎలా పెంచారు?.. దక్షిణాదికి బీజేపీ ధోకా**

**సౌత్‌కు తీవ్ర అన్యాయం.. 24 నుండి 19 శాతానికి తగ్గనున్న ప్రాతినిధ్యం**

**అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. డీలిమిటేషన్ ను వ్యతిరేకిస్తూ తీర్మానం**

**హైదరాబాద్, మహా:** లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనకు ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. గురువారం అసెంబ్లీ సమావేశాల్లో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అనుమతితో సీఎం రేవంత్ రెడ్డి లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనకు వ్యతిరేకంగా తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డీలిమిటేషన్‌పై రాష్ట్రాల అభిప్రాయాలను తీసుకోకపోవడాన్ని సభ తీవ్రంగా ఖండిస్తోందని అన్నారు. పునర్విభజనతో జనాభా తగ్గిన రాష్ట్రాలు నష్టపోకూడదని అన్నారు. ప్రస్తుతం ఉన్న నియోజకవర్గాలను మాత్రమే కొనసాగించాలని తెలంగాణ అసెంబ్లీ సాక్షిగా తాము డిమాండ్ చేస్తున్నామని అన్నారు.

మిగతా 2లో



### సీతక్కకు అండగా.. నెటిజన్లు

- నీకు తెలుగు ఎందుకు రాదు?
- యాభై ఏళ్ళయినా.. తెలుగు నేర్చుకోరా?
- అక్బరుద్దీన్ పై నెటిజన్ల ఫైర్
- ఎంఐఎం ఎమ్మెల్యేలంతా తెలుగు నేర్చుకోవాలని సూచన

వివరాలు 2లో



### ఊబర్, ఓలా, ర్యాపిడోలకు దీటుగా సహకార్ టాక్సీ

- పార్లమెంటులో ప్రకటన చేసిన అమిత్ షా
- డ్రైవర్లకే లాభాలు, కార్పొరేట్ సంస్థలకు వాటా ఇవ్వాల్సిన పనిలేదని వెల్లడి
- త్వరలోనే టూ వీలర్, ఆటో, ఫోర్-వీలర్ టాక్సీల నమోదు
- రాబోయే నెలల్లో దేశవ్యాప్తంగా సహకార్ టాక్సీ సేవలు అందుబాటులోకి

వివరాలు 2లో



### ఉప ఎన్నికలు పక్కా

- పాడికౌశిక్ రెడ్డి జోస్యం
- పొంగులేటి రాఘవ కన్ స్ట్రక్షన్ కంపెనీని బ్యాన్ చేయాలి

వివరాలు 2లో



### కంటతడి పెట్టిన మంత్రి సీతక్క

- మంత్రి సీతక్క భర్త కామ్రేడ్ కుంజ రాము 20వ వర్థంతి
- రాము చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు
- భర్తని గుర్తు చేసుకుని కంటతడి పెట్టిన సీతక్క

వివరాలు 2లో

# పూరన్, మార్ష్ విధ్వంసం

## సన్‌రైజర్స్‌ను చిత్తు చేసిన లక్నో

ఐపీఎల్ 2025లో లక్నో సూపర్ జెయింట్స్ బోణీ కొట్టింది. ఉప్పల్ వేదికగా సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన మ్యాచ్‌లో 5 వికెట్ల తేడాతో లక్నో ఘన విజయం సాధించింది. 191 పరుగుల భారీ లక్ష్యాన్ని లక్నో కేవలం 16.1 ఓవర్లలో ఊదిపడేసింది. లక్నో బ్యాటర్లలో నికోలస్ పూరన్ విధ్వంసకర ఇన్నింగ్స్ ఆడాడు. కేవలం 26 బంతులు మాత్రమే ఎదుర్కొన్న పూరన్.. 6 ఫోర్లు, 6 సిక్స్‌లతో 70 పరుగులు చేసి టాప్ స్కోరర్‌గా నిలిచాడు. అతడితో పాటు ఇంపాక్ట్ ప్లేయర్‌గా బరిలోకి దిగిన మిచెల్ మార్ష్ సైతం తన బ్యాట్‌కు పనిచెప్పాడు. 31 బంతుల్లో 7 ఫోర్లు, 2 సిక్స్‌లతో 52 పరుగులు చేశాడు. ఎస్ఆర్‌హెచ్ బౌలర్లలో కమ్మిన్స్ రెండు వికెట్లు పడగొట్టగా.. జంపా, హర్షల్ పటేల్, షమీ తలా వికెట్ సాధించారు. ఎస్ఆర్‌హెచ్ బౌలర్లు తమ స్థాయికి తగ్గ ప్రదర్శన చేయలేకపోయారు. భారీగా పరుగులు సమర్పించుకున్నారు.

### నాలుగేసిన శార్దూల్..

ఇక టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన ఎస్ఆర్‌హెచ్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 190 పరుగులు చేసింది. లక్నో బౌలర్లు అద్భుతంగా రాణించారు. లక్నో పేసర్ శార్దూల్ ఠాకూర్ నాలుగు వికెట్లతో చెలరేగాడు. అతడితో పాటు ప్రిన్స్ యాదవ్, దిగ్వేష్, రవి బిష్ణోయ్, ప్రిన్స్ యాదవ్ తలా వికెట్ సాధించారు. ఎస్ఆర్‌హెచ్ బ్యాటర్లలో ట్రావిస్ హెడ్(47) పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలవగా.. అనికేత్ వర్మ(36), నితీశ్ కుమార్ రెడ్డి(32),క్లాసెన్(26) రాణించారు.

# కలెక్టర్లా.. కామన్ మ్యాన్ లా

**ఇది సార్.. మా బ్రాండ్**

**మార్పుకు అంబాసిడర్లు**

**జనంతో మమేకమవుతున్న జిల్లా కలెక్టర్లు**

**జనంతో మమేకమవుతున్న జిల్లా కలెక్టర్లు**

**ప్రభుత్వం ఇచ్చిన స్వేచ్ఛతో.. ప్రజల హృదయాల్లో ముద్ర**

వివరాలు 4లో

# బీజేపీ పగ్గాలు మళ్ళీ కిషన్ రెడ్డికే

**మరో ఏడాది కొనసాగించాలని అధిష్టానం నిర్ణయం..**

**కీలకనేతలకు సమాచారం**

**తీవ్రపోటీ నేపథ్యంలో హడావుడిగా నిర్ణయం తీసుకోవొద్దని భావిస్తున్న అధిష్టానం**



**హైదరాబాద్, మహా:** తెలంగాణ బీజేపీ కొత్త అధ్యక్షుడుగా ఎవరు రాబోతున్నారనేది సస్పెన్స్ థ్రిల్లర్ ను తలపిస్తుండగా, గురువారం దీనికి సంబంధించి హైకమాండ్ నుండి సంకేతాలు అందినట్లు తెలుస్తోంది. ప్రస్తుత సోషల్ మీడియాతో పాటు ప్రముఖ వార్తా ఛానెల్స్ లో రోజుకో పేరు వస్తుండగా, కిషన్ రెడ్డి ఉన్నట్టుండి ఢిల్లీ వెళ్లడంతో.. కొత్త అధ్యక్షుడి ప్రకటన దాదాపు ఖాయమైందని కాషాయవర్గాలు భావించారు. షెడ్యూలు ప్రకారం.. జరిగే కార్యక్రమాలు రద్దు చేసుకొని మరీ కిషన్ రెడ్డి ఢిల్లీకి వెళ్లారు.

మిగతా 3లో

# అసెంబ్లీలో కాగ్ రిపోర్ట్

- 2023-24 బడ్జెట్ అంచనా రూ. 2,77,690 కోట్లు
- చేసిన వ్యయం రూ. 2,19,307 కోట్లు
- బడ్జెట్ అంచనాలో 79 శాతం వ్యయం
- జీఎస్డీపీలో వ్యయం అంచనా 15 శాతం
- ప్రవేశపెట్టిన డిప్యూటీ సీఎం భట్టి

**హైదరాబాద్, మహా:** అసెంబ్లీలో కాగ్ నివేదికను ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రవేశపెట్టారు. 202324 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఫైనాన్స్ అకౌంట్స్, అప్రోప్రియేషన్ అకౌంట్స్‌పై కాగ్ నివేదిక సమర్పించగా దానిని, తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క శాసనసభలో ప్రవేశపెట్టారు.

మిగతా 3లో



# 6 గురి కోసం 600 మంది

- టన్నెలోకి కడావర్ డాగ్స్
- మరోసారి బిగ్ ఆపరేషన్

వివరాలు 3లో



# కేంద్రాన్ని ఎందుకు నిలదీయడం లేదు?


- తెలంగాణకు కేంద్రం ఇచ్చింది గుండుసున్నానే కదా?
- అసెంబ్లీలో సీఎం రేవంత్ పై కేటీఆర్ ప్రశ్నల వర్షం
- రుణమాఫీపై ఏ గ్రామంలో నైనా చర్చకు రెడీ

03

# జైల్లో డబుల్ బెడ్ రూం.. హామీ నెరవేర్చలేదు

**మహా :** అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి మరోసారి కేసీఆర్ కుటుంబంపై కీలక వ్యాఖ్యలు చేశారు. తాను ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా ప్రతీకార చర్యలకు పాల్పడుతున్నారంటూ ప్రతిపక్ష నేతలు చేసిన ఆరోపణలకు సమాధానం ఇచ్చే క్రమంలో రేవంత్ రెడ్డి భావోద్వేగానికి లోనయ్యారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తనను నిర్ధాక్షిణ్యంగా అరెస్టు చేసి తన కూతురి పెళ్లికి కూడా వెళ్లకుండా చేశారని.. 16 రోజులు నిద్రలేని రాత్రులు గడిపానంటూ సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఈ క్రమంలో మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కుటుంబంపై తనదైన శైలిలో రేవంత్ రెడ్డి విరుచుకుపడ్డారు. ఈ సందర్భంగా తాను ఎన్నికల్లో ఇచ్చిన ఓ హామీని అమలు చేయలేదని అసెంబ్లీ సాక్షిగా రేవంత్ రెడ్డి ఒప్పుకున్నారు. "నేను కక్ష సాధింపునకు పాల్పడితే మీ కుటుంబం అంతా చంచల్‌గూడలో ఉండేవారు. ఎంపీగా ఉన్న నన్ను ఆరోజు చర్లపల్లి జైలుకు పంపారు. బిడ్డ పెండ్లి పత్రిక పెట్టుకునేందుకు కూడా పంపకపోతే సుప్రీం కోర్టు లాయర్ల ద్వారా కండీషన్ బెయిల్ తెచ్చుకున్నా ఎన్ కన్వెన్షన్‌లో పెండ్లి పత్రిక రాసుకుని అక్కడి నుంచి నేరుగా చంచల్‌గూడా జైలుకే వెళ్లా అని ఇన్నారు. అనుమతి లేకుండా డ్రోన్ ఎగుర వేశారన్న అభియోగంపై 16 రోజులు డిటెన్షన్ సెల్‌లో నన్ను నిర్బంధించారు. జైల్లో 16 రోజులు నిద్రలేని రాత్రులు గడిపాను. దేవుడు అన్ని చూస్తాడు అని వేచిచూశా. నేను ప్రమాణస్వీకారం చేసిన రోజే వాళ్లు ఆస్పత్రి పాలయ్యారు." అని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు.

"నేను కక్ష సాధింపు చర్యలకు పాల్పడితే మీ కుటుంబంలో అందరూ జైలుకు వెళ్తారు. ఈ రోజు వరకు కూడా అక్రమ కేసులు పెట్టలేదు. పార్టీ ఆఫీసులో సొంత కూలీలతో పచ్చి బూతులు మాట్లాడించినా కక్ష సాధింపునకు పాల్పడలేదు. ఒక్కొక్కరి చెంపలు పగలగొట్టే శక్తి ఉన్నా సంయమనం పాటించాను. ముఖ్యమంత్రి విచక్షణాధికారాలు ఉపయోగిస్తే మీరు ఒక్కరైనా బయట ఉండేవారా..? కేసీఆర్ కుటుంబానికి జైల్లో డబుల్ బెడ్ రూం ఇల్లు కట్టిస్తా అని ఎన్నికల హామీ ఇచ్చా, ఆ హామీ కూడా ఇంకా నెరవేర్చలేదు." అని సీఎం రేవంత్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. గత ప్రభుత్వం ఎన్నికల ముందు రూ.లక్ష రుణమాఫీ చేస్తామని చెప్పి ఐదేళ్లు తీసుకుందని సీఎం రేవంత్ రెడ్డి విమర్శించారు. రెండోసారి రుణమాఫీ చేస్తామని అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత పదేళ్లలో 21 లక్షల మంది రైతులకు రూ.16,908 కోట్లు రుణమాఫీ చేశారని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత 25 లక్షల మంది రైతులకు ఒక్కొక్కరికి రూ.2 లక్షల చొప్పున రుణమాఫీ కింద రూ. 20 వేల కోట్లు చెల్లించామని తెలిపారు. రైతుబంధు ఎన్నికల కోడ్‌ను అడ్డం పెట్టుకుని తప్పించుకున్నారని.. ఆ డబ్బును తాను ముఖ్యమంత్రి అయ్యాక చెల్లించానని తెలిపారు. మొదటి విడతలో రూ.7625 కోట్ల రైతుబంధు చెల్లించానని తెలిపారు. రైతు భరోసా పథకం కింద రూ.12 వేల కోట్లు చెల్లించామని రేవంత్ రెడ్డి చెప్పారు. పేద రైతులకు వరి వేస్తే ఉరే అని ప్రచారం చేసి వారు మాత్రం వరి పండించి రూ.4500కు అమ్ముకున్నారని ఆరోపించారు. కానీ తాము మాత్రం వరి వేయమని రైతులను ప్రోత్సహించి బోనస్ కూడా ఇచ్చామన్నారు. ఉచిత కరెంట్ తీసుకొచ్చిందే కాంగ్రెస్ పార్టీ అని రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. కరెంట్ అంటే కాంగ్రెస్, కాంగ్రెస్ అంటే కరెంట్ అని గుర్తుంచుకోవాలన్నారు. గత ప్రభుత్వం పదేళ్లలో చేయలేని పనులు తాము పది నెలల్లో చేసి చూపించామన్నారు. తనను సీఎంగా చూసి కళ్లల్లో నిప్పులు పోసుకుంటున్నారని.. కడుపులో కత్తులు పెట్టుకొని మాట్లాడుతున్నారని రేవంత్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం అకాల వర్షాలకు నష్టపరిహారం ఇవ్వలేదని, తాము నష్టపరిహారం చెల్లించామని రేవంత్ రెడ్డి అన్నారు. ఇంత చేస్తున్నా నా కష్టాన్ని గుర్తించి ప్రతిపక్ష నాయకుడు కష్టపడి పనిచేస్తున్నానని చెప్పొచ్చు కదా అని ఆయన అన్నారు. రాష్ట్రానికి నాలుగు రకాలుగా అప్పు చేసుకునే అవకాశం ఉంటుందని, మూడు రకాల అప్పులు కలిపి తెలంగాణ ఏర్పడే నాటికి రూ.90,160 కోట్ల అప్పు ఉండేదని తెలిపారు. 1 డిసెంబర్ 2023 నాటికి అప్పు రూ.6,69,257 కోట్లు అని రేవంత్ రెడ్డి వివరించారు.



# కంటతడి పెట్టిన మంత్రి సీతక్క

## మంత్రి సీతక్క భర్త కామ్రేడ్ కుంజ రాము 20వ వర్ధంతి

### రాము చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు.. భర్తని గుర్తు చేసుకుని కంటతడి పెట్టిన సీతక్క



**మహబూబాబాద్, మహా:** మహబూబాబాద్ జిల్లా కొత్తగూడెం మండలం మొకాల్లాపల్లిలో మంత్రి సీతక్క భర్త కామ్రేడ్ కుంజ రాము 20వ వర్ధంతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రి సీతక్క, అరుణోదయ సాంస్కృతిక సమైక్య చైర్మన్ విమలక్క పాల్గొని కుంజ రాము చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన వర్ధంతి సభలో పలువురు వక్తలు కామ్రేడ్ రాము చేసిన పోరాటాలు ఆయన ఆశయాలను స్మరిస్తూ మాట్లాడారు. కామ్రేడ్ రాముపై ప్రజా కళాకారులు పాడిన పాటల సీడీని సీతక్క విమలక్క చేతుల మీదుగా ఆవిష్కరించారు. విమలక్క మాట్లాడుతూ అమర వీరులను స్మరిస్తూ విమలక్క భావోద్వేగానికి లోనై కంటతడి పెట్టారు. సీతక్క విమలక్కను ఆలింగనం చేసుకొని తన భర్త కామ్రేడ్ కుంజా రాముని గుర్తు చేసుకుని కంటతడి పెట్టడంతో సభ ప్రాంగణంలో కొద్దిసేపు నిశ్శబ్దం ఆవరించింది.

**ప్రజల కోసమే మరణిస్తాం :**

అనంతరం సీతక్క మాట్లాడుతూ కామ్రేడ్ కుంజ రాము చిన్నతనం నుంచి విప్లవ ఉద్యమాలకు వెళ్లి అనంతరం ఆదివాసి ఉద్యమాలకు వైపు సాగుతున్న క్రమంలో పోలీసులు ఎన్‌కౌంటర్‌లో మృతి చెందారని గుర్తు చేసుకున్నారు. ఇప్పటికి 20 సంవత్సరాలు కావస్తుందని, రాముతో పని చేసిన తాను కానీ ఇతర ప్రజా సంఘాలు గాని ఉద్యమ నేతలు ఆయనతో సంబంధం ఉన్న ప్రతి ఒక్కరూ ఈ సభలో పాల్గొని కామ్రేడ్ రాముకు ఘనంగా నివాళులర్పించారని తెలిపారు. ఈరోజు ఎంత ఉన్నత స్థానంలో ఉన్నామని కాదు, ప్రజల కోసం ఎంత అందుబాటులో ఉన్నామనేదే ముఖ్యమని అన్నారు. ఆయన తమకు ఇచ్చిన స్ఫూర్తితో ప్రజల కోసం పని చేస్తామని, ప్రజల కోసమే బతుకుతామని, ప్రజల కోసం చివరి వరకు పోరాడతామని, ప్రజల కోసమే మరణిస్తామని స్పష్టం చేశారు.

# సీతక్కకు అండగా.. నెటిజన్లు

## నీకు తెలుగు ఎందుకు రాదు?

### యాభై ఏళ్ళయినా.. తెలుగు నేర్చుకోరా?.. అక్బరుద్దీన్ పై నెటిజన్ల ఫైర్

### ఎంఐఎం ఎమ్మెల్యేలంతా తెలుగు నేర్చుకోవాలని సూచన

**హైదరాబాద్, మహా:** తెలంగాణ మంత్రి సీతక్కకు ఇంగ్లీష్, హిందీ రాదని.. తనకేమో తెలుగు రాదని అందుకే తన మాటలను మంత్రి తప్పుగా అర్థం చేసుకున్నారంటూ ఎంఐఎం శాసనసభా పక్ష నేత అక్బరుద్దీన్ నిన్న సభలో చేసిన వ్యాఖ్యలకు తెలంగాణ విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి కౌంటర్ ఇచ్చారు. 'మంత్రి గారికి హిందీ రాదు సరే.. మరి నీకు తెలుగు ఎందుకు రాదు బాబు?' అంటూ ఇవాళ ఎక్స్ వేదికగా ప్రశ్నించారు. హైదరాబాద్‌లోనే పుట్టి పెరిగావ్ కదా.. రాష్ట్రంలోనే మెజారిటీ ప్రజలు మాట్లాడే మొదటి అధికార భాష తెలుగు నేర్చుకోవాలనే సామాజిక బాధ్యత మీకు ఉండాలి కదా అని నిలదీశారు. అసెంబ్లీలో అందరూ సభ్యులు, మంత్రులు తెలుగులోనే మాట్లాడుతున్నప్పుడు మీకు ఏం అర్థం అవుతుంది? ఏదో ఒకటి సభలో ఇంగ్లీష్ స్పీచ్ దంచేసి వెళ్లిపోతే సరిపోతుందా? తెలుగు రాకపోతే రాష్ట్రంలో సమస్యలు మీకు ఎలా అర్థం అవుతాయన్నారు. హిందీ, ఇంగ్లీష్ రాకపోతే అంత చిన్నచూపెందుకు..? అని మండిపడ్డారు. యాభై ఏళ్ళుగా ప్రజాప్రతినిధులుగా చేస్తున్నారు.. మీకెందుకు తెలుగు రాదు అంటూ నెటిజన్ల తీవ్రంగా ఫైరయితూ సీతక్కకు అండగా నిలుస్తున్నారు. ఎంఐఎం ఎమ్మెల్యేలంతా తెలుగు నేర్చుకోవాలని , అట్టడుగు స్థాయి నుండి ఎదిగిన మహిళానేతలను గౌరవించాలని, స్ఫూర్తిని అభినందించాలని సూచిస్తున్నారు.

# తెలంగాణలో అసెంబ్లీ సీట్లు ఎందుకు పెంచలేదు?

## సిక్కిం, కాశ్మీర్‌లో ఎలా పెంచారు?.. దక్షిణాదికి బీజేపీ ధోకా

### సౌత్‌కు తీవ్ర అన్యాయం.. 24 నుండి 19 శాతానికి తగ్గనున్న ప్రాతినిధ్యం

### అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. డీలిమిటేషన్ ను వ్యతిరేకిస్తూ తీర్మానం

(మొదటిపేజీ తరువాయి)

రాష్ట్రంలో అసెంబ్లీ నియోజకవర్గాలను 153కు పెంచాలని డిమాండ్ చేశారు. ప్రస్తుత జనాభాను ప్రాతిపదికగా తీసుకుని ఎస్సీ, ఎస్టీ సీట్లను కూడా పెంచాల్సిన అవశ్యకత ఉందన్నారు.

**లిమిటేషన్ వల్ల సౌత్‌కు అన్యాయం..**

డీలిమిటేషన్ విధానంపై సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో మాట్లాడుతూ, డీలిమిటేషన్‌పై కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాల అభిప్రాయాలు తీసుకోకపోవడాన్ని తెలంగాణ అసెంబ్లీ తీవ్రంగా ఖండిస్తోంది. డీలిమిటేషన్ అనేది సౌత్‌కు లిమిటేషన్‌గా మారే ప్రమాదం ఉంది. 1971 నుంచి జనాభా నియంత్రణ విధానాలను దక్షిణాది రాష్ట్రాలు సమర్థవంతంగా అమలు చేశాయి.కానీ ఉత్తరాది రాష్ట్రాల్లో జనాభా నియంత్రణ జరగలేదు. 2026లో జనాభా లెక్కలు చేపట్టి నియోజకవర్గాల పునర్విభజన చేపట్టాలనుకోవడం కరెక్ట్ కాదు. దీనివల్ల జనాభా తగ్గించిన రాష్ట్రాలు నష్టపోకూడదు. డీలిమిటేషన్ వల్ల ఆర్థిక ప్రయోజనాలతోపాటు ఉద్యోగ, ఉపాధి అంశంలో దక్షిణాది రాష్ట్రాలకు తీవ్ర అన్యాయం జరిగేలా ఉంది. లోక్‌సభ సీట్లను కేంద్రం పునర్విభజన చేస్తే దక్షిణాది ప్రమేయం లేకుండానే కేంద్రంలో ప్రభుత్వాలు ఏర్పడతాయని అన్నారు.

**మన ప్రాతినిధ్యం 24 నుంచి 19 శాతానికి పడిపోతుంది**

డీలిమిటేషన్‌పై తమిళనాడు సీఎం స్టాలిన్ ఇటీవల ఏర్పాటు చేసిన సమావేశం గురించి కూడా సీఎం రేవంత్ ప్రస్తావించారు. నియోజవర్గాల పునర్విభజన జనాభా ప్రాతిపదికన చేపట్టడాన్ని వాజ్‌పేయి సైతం వ్యతిరేకించారని గుర్తుచేశారు. ఈ ప్రక్రియను ఎంత మాత్రం అంగీకరించబోమని, ఒకవేళ ఈ విధానం అమల్లోకి వస్తే లోక్‌సభలో దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం 24 నుంచి 19 శాతానికి పడిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంలో అందరం ఒకే మాటపై ఉందామని పార్టీలను కోరారు. రాజకీయ ప్రయోజనాల కోసం సిక్కిం, జమ్మూకశ్మీర్ నియోజకవర్గాలను పెంచిన కేంద్రం పునర్విభజన చట్టం ప్రకారం ఏపీ, తెలంగాణ శాసనసభ నియోజకవర్గాలను ఎందుకు పెంచడం లేదని ప్రశ్నించారు. పార్లమెంటులో 24 శాతం మాత్రమే ప్రాతినిధ్యం ఉన్న దక్షిణాది రాష్ట్రాలు 36 శాతం పన్నులు కడుతున్నా అందులోంచి తిరిగి వచ్చేది తక్కువే అని అన్నారు. ఇందుకు భిన్నంగా కేంద్రం పన్నుల్లో ఉత్తర్‌ప్రదేశ్, బిహార్, మధ్యప్రదేశ్‌కు ఎక్కువ వాటా ఉందని అన్నారు.

**వాళ్లకి పెంచారు.. మనకెందుకు పెంచరు**

2026 జనాభా లెక్కల ప్రకారం పార్లమెంటు నియోజకవర్గాల పునర్విభజన చేయవద్దని.. ప్రస్తుతం ఉన్న నియోజకవర్గాలనే కొనసాగించాలని డిమాండ్ చేస్తూ సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణ అసెంబ్లీలో డీలిమిటేషన్‌కు వ్యతిరేకంగా తీర్మానం ప్రవేశపెట్టారు. దీంతో పాటుగా తెలంగాణాలో అసెంబ్లీ నియోజకవర్గాలను 153కు పెంచాలని.. జనాభాకు అనుగుణంగా ఎస్సీ, ఎస్టీ సీట్లను పెంచాలని అన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ ప్రయోజనం కోసం జమ్మూకశ్మీర్, అసోంలో నియోజకవర్గాలు పెంచారని ఉదహరించారు.



# సభలో అప్పులు లేనిది ఎవరికి..?

## కేటీఆర్ ఆసక్తికర వ్యాఖ్య.. మీరు గ్రేట్ భట్టి గారు



# ఉప ఎన్నికలు పక్కా

- పాడికౌశిక్ రెడ్డి జోస్యం
- పొంగులేటి రాఘవ కన్ స్ట్రక్షన్ కంపెనీని బ్యాన్ చేయాలి

**హైదరాబాద్, మహా:** తెలంగాణలో కచ్చితంగా ఉప ఎన్నికలు వస్తాయని... పాడి కౌశిక్ రెడ్డి స్పష్టం చేశారు. ఇవాళ అసెంబ్లీ మీడియా పాయింట్ దగ్గర... గులాబీ పార్టీ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... సీఎం రేవంత్ రెడ్డి జాగిరి కాదని... తెలంగాణలో ఎలాగైనా ఉప ఎన్నికలు వస్తాయని తేల్చి చెప్పారు. సుప్రీం కోర్టు మీద తమకు నమ్మకం ఉందని... వెల్లడించారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలకు వ్యతిరేకంగా తీర్పు రావడం గ్యారంటీ అని పాడి కౌశిక్ రెడ్డి అన్నారు. మంత్రి పొంగులేటి రాఘవ కన్స్ట్రక్షన్ కంపెనీని బ్యాన్ చేయాలని కూడా డిమాండ్ చేశారు.

**హైదరాబాద్, మహా:** తెలంగాణ అసెంబ్లీ సమావేశాల చివరి రోజున సభలో వాడీ వేడీ చర్చలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో శాసనసభలో బీఆర్ఎస్ నేత కేటీఆర్ మాట్లాడుతూ.. ప్రతిదానికి ప్రభుత్వం రాష్ట్రం అప్పుల పాలైందనడం సరికాదని అన్నారు. రాష్ట్రం అప్పుల పాలైంది అనడానికి ఆధారాలు ఏమిటని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. గత పదేళ్ళలో ఏమీ చేయకుండానే రాష్ట్రంలో సంపద పెరిగిందా అని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడినపుడు సగటు ఆదాయం రూ. 3500 కోట్లు ఉంటే, ఇప్పుడు రూ.18 వేల కోట్లు ఉందన్నారు. అమెరికా లాంటి దేశాలకు కూడా అప్పులు ఉంటాయని, అప్పులు లేని దేశం గాని రాష్ట్రం గాని ఉండవన్నారు. అమాటకొస్తే అప్పులు లేని మనిషి కూడా ఉండదని.. ఈ సభలో ఉన్నవారికి కూడా అప్పులు ఉన్నాయన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్, భట్టి మధ్య ఆసక్తికర సంభాషణ జరిగింది. "అప్పులు లేని వాళ్ళు ఈ సభలో ఎవరైనా ఉన్నారా?" అని కేటీఆర్ ప్రశ్నించగా.. దానికి భట్టి విక్రమార్క "నాకు లేవు" అన్నారు. అందుకు కేటీఆర్ "మీరు గ్రేట్ భట్టి గారు, రాష్ట్రానికి ఆర్థికమంత్రి కదా అలాగే ఉండాలి.." అనడంతో సభలో కొద్దిసేపు నవ్వులు విరిసాయి.

# 11 రోజుల పాటు సాగిన అసెంబ్లీ

### 97 గంటల 32 నిమిషాల పాటు సభ 12 బిల్లులకు ఆమోదం



**హైదరాబాద్, మహా:** తెలంగాణ అసెంబ్లీ నిరవధిక వాయిదా పడింది. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ముగిశాయి. మొత్తం 11 రోజుల పాటు శాసన సభ సమావేశాలు సాగాయి. మొత్తం 97 గంటల 32 నిమిషాల పాటు శాసన సభ కొనసాగింది. ఈ 11 రోజుల్లో 12 బిల్లులను ప్రవేశ పెట్టి అసెంబ్లీ ఆమోదం తెలిపింది. ఈ మేరకు శాసన సభ వ్యవహారాల శాఖ వివరించింది. కాగా స్పీకర్ బులెటిన్ లో కాంగ్రెస్ 65, బీఆర్ఎస్ 38, బిజెపి 8, ఎంఐఎం 7, సిపిఐ 1గా సభ్యుల సంఖ్య పేర్కొన్నారు.



# రేవంత్ రెడ్డి చేతల్లో చూపించారు

## తమిళనాడు సీఎం స్టాలిన్ ప్రశంసలు..

## తెలంగాణ అసెంబ్లీ తీర్మానం ఓ మైలురాయి

**హైదరాబాద్, మహా:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై తమిళనాడు సీఎం స్టాలిన్ ప్రశంసల జల్లు కురిపించారు. డీలిమిటేషన్ కు వ్యతిరేకంగా తెలంగాణ శాసనసభలో ఒక ముఖ్యమైన మైలురాయిలా నిలిచిపోయే తీర్మానం చేసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన మాటలను చేతల్లో నిరూపించారని తమిళనాడు సీఎం స్టాలిన్ కొనియాడారు. జనాభా ప్రాతిపదికన పునర్విభజనను వ్యతిరేకిస్తూ సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వాన తెలంగాణ శాసనసభ గురువారం తీర్మానం చేసిన నేపథ్యంలో తమిళనాడు ముఖ్యమంత్రి ఎక్స్‌వేదికగా స్పందించారు. న్యాయం, సమానత్వం, సమాఖ్య స్ఫూర్తిని సమర్థిస్తూ సరైన రీతిలో పునర్విభజన కోరుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ శాసనసభలో తీర్మానం చేశారని తమిళనాడు సీఎం పేర్కొన్నారు. చెన్నైలో ప్రతిపాదించిన అంశాలు హైదరాబాద్‌లో నెరవేరాయని, ఇది ఆరంభం మాత్రమేనని.. హైదరాబాద్‌లో ఐక్యకార్యాచరణ సమితి రెండో సమావేశం నేపథ్యంలో మరిన్ని రాష్ట్రాలు అదే బాటలో నడుస్తాయని తమిళనాడు సీఎం అభిప్రాయపడ్డారు. పునర్విభజన విషయంలో తమిళనాడును అనుసరిస్తూ, ఈ చర్యను ప్రజాస్వామ్య సమతుల్యతను దెబ్బతీసే ఏ ప్రయత్నాన్నైనా ప్రతిఘటించే సమష్టితత్వాన్ని బలోపేతం చేస్తుందని ఆయన పేర్కొన్నారు.

# ఊబర్, ఓలా, ర్యాపిడోలకు దీటుగా సహకార్ టాక్సీ

## పార్లమెంటులో ప్రకటన చేసిన అమిత్ షా

### డ్రైవర్లకే లాభాలు, కార్పొరేట్ సంస్థలకు వాటా ఇవ్వాల్సిన పనిలేదని వెల్లడి

### త్వరలోనే టూ వీలర్, ఆటో, ఫోర్‌వీలర్ టాక్సీల నమోదు

### రాబోయే నెలల్లో దేశవ్యాప్తంగా సహకార్ టాక్సీ సేవలు అందుబాటులోకి



**మహా :** ప్రముఖ ట్యాక్సీ సేవల సంస్థలు ఓలా, ఊబర్, ర్యాపిడోలకు దీటుగా కేంద్ర ప్రభుత్వం కూడా ట్యాక్సీ సేవల రంగంలోకి అడుగుపెడుతోంది. ప్రైవేటు సంస్థలకు పోటీగా కేంద్ర ప్రభుత్వం 'సహకార్ టాక్సీ' పేరుతో కొత్త ట్యాక్సీ సేవలను ప్రారంభించనున్నట్లు ప్రకటించింది. ఇందులో భాగంగా బైక్, క్యాబ్ మరియు ఆటో సేవలను అందిస్తుంది. పెద్ద కార్పొరేషన్లతో లాభాలను పంచుకోవాల్సిన అవసరం లేకుండా, డ్రైవర్లు నేరుగా సంపాదించే ప్రత్యామ్నాయ రవాణా సేవను అందించడమే ఈ చర్య యొక్క ముఖ్య ఉద్దేశం. దేశవ్యాప్తంగా టూవీలర్ ట్యాక్సీలు, ఆటోరిక్షాలు, ఫోర్‌వీలర్ ట్యాక్సీలను సహకార్ ట్యాక్సీ వ్యవస్థ కింద నమోదు చేసుకోవడం జరుగుతుందని కేంద్ర హోం మంత్రి, సహకార శాఖ మంత్రి అమిత్ షా పార్లమెంటులో ఈ కార్యక్రమాన్ని ప్రకటించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 'సహకార్ సే సమృద్ధి' అనేది కేవలం నినాదం కాదని, దీనిని సాకారం చేయడానికి సహకార మంత్రిత్వ శాఖ గత మూడున్నర సంవత్సరాలుగా రాత్రింబవళ్లు పనిచేసిందని షా అన్నారు. రాబోయే నెలల్లో సహకార్ ట్యాక్సీ సేవను ప్రారంభించనున్నట్లు షా పేర్కొన్నారు. ప్రైవేట్ కంపెనీల మాదిరిగా కాకుండా, ప్రభుత్వం మద్దతుతో నడిచే సహకార్ ట్యాక్సీ సేవ ద్వారా వచ్చే ఆదాయం అంతా డ్రైవర్లకే చెందుతుందని, ఇది వారికి ఆర్థికంగా ఎక్కువ ప్రయోజనం చేకూరుస్తుందని తెలిపారు. సహకార్ సేవ ద్వారా వచ్చే లాభాలు ఏ పెద్ద పారిశ్రామికవేత్తకు వెళ్లవు, వాహనాల డ్రైవర్లకు మాత్రమే వెళతాయని అమిత్ షా స్పష్టం చేశారు. అదనంగా, దేశంలోని సహకార వ్యవస్థలో బీమా సేవలు అందించేందుకు ఒక సహకార బీమా కంపెనీ కూడా ఏర్పాటు చేస్తామని షా చెప్పారు. తక్కువ సమయంలోనే ఇది ప్రైవేట్ రంగంలోనే అతిపెద్ద బీమా కంపెనీగా అవతరిస్తుందని అన్నారు. ఈ కొత్త కార్యక్రమం ప్రయాణికులకు నమ్మకమైన మరియు తక్కువ ఖర్చుతో కూడిన రవాణా ఎంపికను అందించడంతో పాటు డ్రైవర్లకు సాధికారత అందించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్టు అమిత్ షా వివరించారు. ఇలాంటి సహకార ట్యాక్సీ విధానమే 'యాత్రి సాథీ' పేరుతో పశ్చిమ బెంగాల్‌లో ఇప్పటికే నడుస్తోంది. ఇది మొదట్లో కోల్‌కతాలో మాత్రమే అందుబాటులో ఉండేది. ప్రస్తుతం సిలిగురి, అసన్సోల్ మరియు దుర్గాపూర్ వంటి నగరాలకు విస్తరించింది. యాత్రి సాథీ శీఘ్ర బుకింగ్‌లు, స్థానిక భాషల మద్దతు, సరసమైన ఛార్జీలు మరియు రౌండ్‌దిక్లాక్ కస్టమర్ సహాయాన్ని అందిస్తూ ప్రయాణికులలో మంచి గుర్తింపు తెచ్చుకుంది. 2022లో, కేరళ ప్రభుత్వం సొంతంగా ఆన్‌లైన్ ట్యాక్సీ సేవ 'కేరళ సవారి'ని ప్రారంభించిన మొదటి రాష్ట్రంగా నిలిచింది. తక్కువ వినియోగం కారణంగా ఇది మూతపడినప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం ఇప్పుడు సవరించిన ఛార్జీలు మరియు మెరుగైన సాఫ్ట్‌వేర్‌తో తిరిగి ప్రారంభించాలని యోచిస్తోంది.

# అసెంబ్లీలో కాగ్ రిపోర్ట్



(మొదటిపేజీ తరువాయి)

కాగ్ నివేదిక ప్రకారం.. 202324 బడ్జెట్ అంచనా రూ. 2,77,690 కోట్లు, చేసిన వ్యయం రూ. 2,19,307 కోట్లు. బడ్జెట్ అంచనాలో 79 శాతం వ్యయం లభించింది.. జీఎస్డీపీలో వ్యయం అంచనా 15 శాతం వచ్చింది. ఆమోదం పొందిన బడ్జెట్ కంటే ప్రభుత్వం అదనంగా అంచనాల్లో 33 శాతం 1,11,477 కోట్లు ఖర్చు చేసింది. 349 రోజుల పాటు 10,156 కోట్లు వేస్ అండ్ మీన్స్ అడ్వాన్స్ సదుపాయాన్ని వినియోగించుకుంది 35,425 కోట్ల ఓవర్ డ్రాఫ్ట్ సదుపాయాన్ని 145 రోజుల పాటు వినియోగించుకుంది ప్రభుత్వం. గత ఐదేళ్లలో 4లక్షల 3వేల 664 కోట్ల అప్పులు చేసినట్టు సదరు కాగ్ రిపోర్టులో వెల్లడైంది. 202324 ఏడాదిలో పబ్లిక్ మార్కెట్ నుంచి రూ. 49,618 కోట్ల అప్పులు తీసుకున్నట్టు కాగ్ పేర్కొంది. గత ఏడాది కాలంలో 200 శాతం ఎఫ్ ఆర్ బిఎం పరిధి పెరిగినట్లు తెలిపింది. పలు కార్పొరేషన్ల ద్వారా తీసుకున్న అప్పు రూ.2 లక్షల 20 వేల కోట్లని వెల్లడించింది. వేతనాల కోసం రూ.26,981 కోట్లు ఖర్చు చేసినట్టు కాగ్ రిపోర్ట్‌లో వెల్లడైంది. ప్రభుత్వ ఖజానాకు పన్ను ఆదాయం నుంచే 61.89 శాతం నిధులు వస్తున్నాయని, 202324లో కేంద్రం నుంచి వచ్చిన గ్రాంట్లు రూ.9,934 కోట్లని కాగ్ వెల్లడించింది. రెవెన్యూ రాబడుల్లో 45% సర్కారీ ఉద్యోగుల వేతనాలకు తెచ్చిన అప్పులకు వడ్డీ చెల్లింపులు, పెన్షన్లకే ఖర్చవుతోందని నివేదికలో తెలిపింది. 202324లో రెవెన్యూ మిగులు రూ.779 కోట్లని, లోటు రూ49,977 కోట్లుని స్పష్టం చేసింది. ప్రభుత్వ ఖజానాకు పన్ను ఆదాయం నుంచే 61.89 శాతం నిధులు వస్తున్నాయని, 202324లో కేంద్రం నుంచి వచ్చిన గ్రాంట్లు రూ.9,934 కోట్లని కాగ్ వెల్లడించింది. రెవెన్యూ రాబడుల్లో 45% సర్కారీ ఉద్యోగుల వేతనాలకు తెచ్చిన అప్పులకు వడ్డీ చెల్లింపులు, పెన్షన్లకే ఖర్చవుతోందని నివేదికలో తెలిపింది.

### అప్పులు... లెక్కలు

**2023-24 ముగిసే వరకు రుణాల మొత్తం రూ. 4,03,664 కోట్లు, జీఎస్డీపీలో అప్పల శాతం 27గా ఉంది. 2023-24 వరకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన గ్యారంటీల మొత్తం రూ. 2,20,607 కోట్లు. 2023-24 లో తీసుకున్న ప్రభుత్వం 50,528 కోట్లలో 43,918 కోట్లను మూలధనం వ్యయంపై ఖర్చు చేసింది. 2023-24 లో స్థానిక సంస్థలు, ఇతర సంస్థలకు ప్రభుత్వం ఇచ్చిన నిధులు 76,773 కోట్లు అంటే గతం కంటే 11 శాతం పెరిగిందని కాగ్ నివేదిక వెల్లడించింది.**

202324లో రెవెన్యూ మిగులు రూ.779 కోట్లని, లోటు రూ49,977 కోట్లుని స్పష్టం చేసింది. 2023 24లో స్థానిక సంస్థలు, ఇతర సంస్థలకు రూ.76,776 కోట్లు చెల్లింపులు జరిగాయని, 11% పెరుగుదల స్థానిక సంస్థలు, ఇతర సంస్థలకు ప్రభుత్వం నిధుల పెంపుదలగా చెప్పింది. 202224లో ప్రభుత్వం తీసుకున్న అప్పు రూ.53,144కోట్లుగా కాగ్ వెల్లడించింది. బడ్జెట్ అంచనాలో 79 శాతం వ్యయం అయిందని, ఆమోదం పొందిన బడ్జెట్ కంటే అదనంగా అంచనాల్లో 33 శాతం ఖర్చు కాగా, ఇది రూ.1,11,477 కోట్లుగా కాగ్ నివేదికలో వెల్లడైంది.

# కేంద్రాన్ని ఎందుకు నిలదీయడం లేదు?

## తెలంగాణకు కేంద్రం ఇచ్చింది గుండుసున్నానే కదా?

### అసెంబ్లీలో సీఎం రేవంత్ పై కేటీఆర్ ప్రశ్నల వర్షం

### రుణమాఫీపై ఏ గ్రామంలో నైనా చర్చకు రెడీ



**మహా :** కేంద్ర బడ్జెట్ లో తెలంగాణకు జరిగిన అన్యాయంపై ఎందుకు మాట్లాడట్లేదు?. ప్రతి పనిలో గత ప్రభుత్వమని మమ్మల్ని విమర్శిస్తున్నవారు కేంద్రంపై ఎందుకు మాట్లాడలేకపోతున్నారు. తెలంగాణలోని ప్రముఖ ఆలయాలకు కేంద్రం ఒక్క రూపాయైనా ఇచ్చిందా?. సమ్మక్క సారలమ్మ జాతరను జాతీయ పండుగగా గుర్తించాలి. కుంభమేళాకు కేంద్రం నిధులు ఇస్తుంది. సమ్మక సారలమ్మ జాతరకు ఎందుకు నిధులు ఇవ్వరు. మనం అడగకపోతే కేంద్రం నిధులు ఇవ్వదు. కొట్లాడకపోతే కేంద్రం నిధులు కూడా ఇవ్వదు. పోరాడాల్సిందే. కేంద్రంతో గట్టిగా మాట్లాడేందుకు మేము కూడా మద్దతిస్తాం అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో తమ పార్టీకి ఒక్క సీటు కూడా రాలేదని విమర్శించారని గుర్తు చేశారు. తమకు వచ్చిందే సున్నానే మరి కేంద్ర బడ్జెట్ లో తెలంగాణకు వచ్చింది గుండు సున్నా కాదా అని నిలదీశారు. పీఎం, సీఎం పచ్చి అబద్ధాలు చెప్తున్నారని, కేంద్రంతో సఖ్యత వల్ల రేవంత్‌రెడ్డి ఏం సాధించారని నిలదీశారు.

**కొండారెడ్డిపల్లి పోదామా? సిరిసిల్ల పోదామా?**

మాజీ మంత్రి కేటీఆర్ అసెంబ్లీలో రెచ్చిపోయారు. గత పాలకులు తనను జైలుకు పంపిన వైనంపై సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై స్పందిస్తూ ఆగ్రహంతో ఊగిపోయారు. సీఎం రేవంత్ రెడ్డి స్వాతంత్ర ఉద్యమం చేసి జైలుకు పోలేదని, తప్పు చేశారని కోర్టు నమ్మింది కాబట్టే జైలు వెళ్లారని కేటీఆర్ అన్నారు. 'ఎవరో ముక్కు మొహం తెలియని వ్యక్తి వచ్చి మన ఇంటి మీద డ్రోన్ ఎగరేస్తే ఊరుకుంటమా?, ఇంట్లో భార్య, బిడ్డను ఎవడో ఫొటోలు తీస్తుంటే చూస్తూ ఊరుకోవాలా?, నీ జూబ్లీ హిల్స్ ప్యాలెస్ మీదకి డ్రోన్ పంపిస్తే ఊరుకుంటావా?.. అక్కడ నీ బిడ్డనో, భార్యనో ఉంటే వాళ్ళను ఇష్టం ఉన్నట్లు ఫోటో తీస్తే ఊరుకుంటావా?' అని సీఎం రేవంత్ రెడ్డిని కేటీఆర్ ప్రశ్నించారు. అంతేకాదు.. 'నా మీద లేనిపోని రంకులు అంటగట్టారు. నా కుటుంబాన్ని నిందించారు. ఆ సమయంలో చిన్న పిల్లోడు అయిన నా కుమారుడ్ని కూడా ఇష్టానుసారం మాట్లాడారు. మీ ఇంట్లో వాళ్లే ఆడవాళ్లు, మా ఇంట్లో వాళ్లు కారా?' అని అన్నారు. అయినా సీఎం రేవంత్ రెడ్డిని జైలుకు పంపింది నాటి ప్రభుత్వం కాదని కోర్టులు పంపాయన్నారు. ముఖ్యమంత్రి చిలిపి హెచ్చరికలకు ఇక్కడ ఎవరూ భయపడరు అని తెలిపారు. అసలు సీఎం రేవంత్ రెడ్డి ఇంత కంగారు ఎందుకు పడుతున్నారో తమకు తెలియట్లేదని విమర్శించారు. ఇచ్చిన హామీలను పక్కన పడేసి నిత్యం బీఆర్ఎస్‌పైనే విమర్శలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర దాటినా ఇంతవరకూ ఒక్క గ్రామంలో కూడా వందశాతం రైతు రుణమాఫీ జరుగలేదని అన్నారు. ఏ ఒక్క గ్రామంలోనైనా వందశాతం రుణమాఫీ అయితే నేను శాశ్వతంగా రాజకీయాలకు దూరంగా ఉంటా అని సీఎం రేవంత్ రెడ్డికి కేటీఆర్ సవాల్ విసిరారు. కొండారెడ్డిపల్లి పోదామా.? లేకపోతే సిరిసిల్ల పోదామా..? అంటూ కేటీఆర్ వ్యాఖ్యానించారు.

# బీజేపీ పగ్గాలు మళ్ళీ కిషన్ రెడ్డికే

## మరో ఏడాది కొనసాగించాలని అధిష్టానం నిర్ణయం..



(మొదటిపేజీ తరువాయి)

బీజేపీ తెలంగాణ అధ్యక్షుడి నియామకం కోసం కసరత్తు జరుగుతున్న ఈ సమయంలో కిషన్ రెడ్డి ఉన్నపళంగా ఢిల్లీకి వెళ్లడంతో పార్టీ శ్రేణులంతా ఉత్కంఠగా ఎదురుచూడగా, అధిష్టాన నిర్ణయంతో కిషన్ రెడ్డే షాక్ కు గురైనట్లు తెలుస్తోంది. రాష్ట్ర అధ్యక్షుడి రేసులో చాలామంది నేతలు ఉన్నారు. ముఖ్యంగా డీకే అరుణ, ఈటల రాజేందర్, రఘునందన్‌రావు, ధర్మపురి అరవింద్, తో పాటు తెలంగాణ బీజేపీ అధ్యక్షుడిగా పనిచేసిన కేంద్ర మంత్రి బండి సంజయ్ పేరు కూడా వినిపించింది. ఇప్పటికే కేరళ సహా పలు రాష్ట్రాలకు కొత్త అధ్యక్షులను నియమించిన బీజేపీ అధిష్ఠానం తెలంగాణకు మరో రెండు మూడు రోజుల్లో కొత్త అధ్యక్షుడిని అధికారికంగా ప్రకటిస్తుందని భావిస్తున్న తరుణంలో స్పష్టమైన నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. తెలంగాణలో ఉన్న ప్రత్యేక పరిస్థితులు, ముక్కోణ రాజకీయాల నేపథ్యంలో ప్రస్తుత బిజెపి అధ్యక్షుడు కిషన్ రెడ్డినే మరో ఏడాది పాటు కొనసాగాలని అధిష్టానం కోరినట్లు తెలుస్తోంది. మరో ఏడాది కిషన్ రెడ్డే కొనసాగుతారంటూ గురువారం హైకమాండ్ ముఖ్యనేతలకు సమాచారం ఇచ్చినట్లు తెలుస్తోంది. పార్టీకి చెందిన కీలకనేత దీనిని ధృవీకరించారు.

# బైరెడ్డి సిద్దార్ధకు కీలక బాధ్యతలు

## యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా నియామకం

## జగన్ సంచలన నిర్ణయం



**మహా:** వైసీపీ బలోపేతంపై ఆ పార్టీ అధినేత, మాజీ సీఎం జగన్ దృష్టి సారించారు. యువతలో ఫాలోయింగ్ ఉన్న బైరెడ్డి సిద్దార్ధ రెడ్డికి వైసీపీ యువజన విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ గా నియమిస్తూ జగన్ నిర్ణయం తీసుకున్నారు. కర్నూలు జిల్లాకు చెందిన బైరెడ్డి వైసీపీ హయాంలో ఉన్న సమయంలోనూ యాక్టివ్ గా వ్యవహరించారు. అప్పట్లో శాప్ ఛైర్మన్ గా పని చేసారు. కాగా, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వైసీపీ హయాం లో నిర్వహించిన ఆడుదాం ఆంధ్రా లో అవినీతి చోటు చేసుకుందని .. విచారణ చేస్తామని చెప్పుకొచ్చారు. దీని పైన సిద్దార్ధ రెడ్డి ఘాటుగా స్పందించారు. కర్నూలు జిల్లాతో పాటు బైరెడ్డి సిద్దార్ధరెడ్డికి రాష్ట్రవ్యాప్తంగా యువతలో ఫాలోయింగ్ ఉండడంతో పాటు కూటమి ప్రభుత్వాన్ని గట్టిగా ఎదుర్కొనే మొండితనం ఉందని జగన్ గుర్తించారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో కర్నూలు, నంద్యాల జిల్లాల్లో పర్యటిస్తూ.. కూటమి ప్రభుత్వాన్ని టార్గెట్ చేస్తున్నారు. జగన్ నాయకత్వం గురించి వివరిస్తున్నారు. యువత లో బైరెడ్డికి ఉన్న పట్టు చూసిన తరువాత పార్టీ యువజన విభాగం పగ్గాలు అప్పగించాలని జగన్ డిసైడ్ అయ్యారు. 2024 ఎన్నికల వేళ కూటమి అధికారంలోకి రావటానికి నాడు యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల పైన పెద్ద ఎత్తున హామీలు ఇచ్చారు. దీంతో.. కూటమి ఈ హామీల అమలు విషయంలో నిర్ణయాలకు అనుగుణంగా స్పందించే బాధ్యతను బైరెడ్డికి జగన్ అప్పగించారు. అదే విధంగా మంచి వాగ్దాటి ఉండటంతో అన్ని జిల్లాల్లో పార్టీ యువజన కేడర్ తో మమేకం అవుతూ.. పార్టీ బలోపేతం దిశగా పని చేయాలని జగన్ ఇప్పటికే నిర్దేశించారు. ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న అవకాశం బైరెడ్డికి దక్కడంతో.. ఇక రాజకీయం ఆసక్తిగా మారనుంది. జగన్ సమర్ధులకు అవకాశమిస్తే మళ్ళీ తిరిగి పార్టీకి పూర్వవైభవం దక్కుతుందని క్యాడర్ అంటున్నారు.



# మల్లారెడ్డినా మజాకా..

- మేడ్చల్ నియోజకవర్గాన్ని జీహెచ్ఎంసీలో కలపొద్దని మంత్రి శ్రీధర్ బాబుకు వినతి
- అసెంబ్లీలో నవ్వులే.. నవ్వులు

**హైదరాబాద్, మహా:** బీఆర్ఎస్ ఎమ్మెల్యే మల్లారెడ్డి అసెంబ్లీలో నవ్వులు పూయించారు. ఆయన మాట్లాడేందుకు నిలబడగా.. మల్లారెడ్డి అంటే మీరే కదా అని స్పీకర్ ప్రశ్నించగా.. ధన్యవాదాలు అధ్యక్షా అంటూ మల్లారెడ్డి మొదలుపెట్టారు. తాను రెండు విషయాలు చేస్తానని.. అందులో ఒకటి ప్రభుత్వానికి పదుకొండ వందల కోట్ల రూపాయల ఆదాయం వచ్చేది అన్నారు మల్లారెడ్డి. రెండోది తన మేడ్చల్ నియోజకవర్గానికి చెందిన కౌన్సిలర్లు, కార్పొరేటర్ల, సర్పంచ్ ల బాధలన్నారు. ఇందులో ఏదో ఒకటి చెప్పాలని స్పీకర్ అన్నారు. దీంతో సభలో అందరూ నవ్వారు. మేడ్చల్ నియోజవర్గానికి దిష్టి తగిలినట్లుందని.. 61 గ్రామాలు పోయి అన్నీ మున్సిపాలిటీలు అయిపోయని మల్లారెడ్డి అన్నారు. మూడు కార్పొరేషన్లు, ఏడు మున్సిపాలిటీలుండగా.. మరో మూడు మున్సిపాలిటీలు చేశారని.. దయచేసి తమకు సేమ్ రిజర్వేషన్ ఉంచాలని.. మమ్మల్ని జీహెచ్ఎంసి లో కలపొద్దంటూ మంత్రి శ్రీధర్ బాబును మల్లారెడ్డి కోరారు. ఇక ప్రభుత్వానికి పదుకొండ వందల కోట్ల రూపాయల ఆదాయం వచ్చేదానిపై మాల్లారెడ్డి మాట్లాడుతుండగా.. స్పీకర్ మైక్ కట్ చేశారు.

# 6 గురి కోసం 600 మంది

## టన్నెల్‌లోకి కడావర్ డాగ్స్.. మరోసారి బిగ్ ఆపరేషన్



**నాగర్ కర్నూల్, మహా:** ఎస్ ఎల్ బిసి సొరంగంలో మరణించిన మరో ఆరుగురి కోసం సహాయక చర్యలు ముమ్మరం చేస్తున్నారు. టన్నెల్‌లోకి మరోసారి కడావర్ డాగ్స్ పంపించినట్లు అధికారులు తెలిపారు. ఈ మేరకు కేరళకు చెందిన ప్రత్యేక శిక్షణ పొందిన కడావర్ డాగ్స్‌ను గురువారం ఉదయం 11 గంటలకు సొరంగంలోనికి పంపినట్లు ప్రత్యేక అధికారి శివశంకర్ లోతేటి చెప్పారు. ప్రమాదం జరిగిన ప్రదేశంలో సహాయక చర్యలు వేగవంతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక అధికారి శివశంకర్ లోతేటి ని నియమించింది. దీంతో గురువారం ఉదయం 10 గంటలకు సహాయక బృందాల ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి అధికారులకు పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన సహాయక బృందాలు 34 రోజులుగా నిరంతరం సహాయక చర్యలో పాల్గొంటున్నాయి. ప్రతిరోజు 3 షిఫ్టులలో 600 మంది సిబ్బంది పాల్గొంటూ సహాయక చర్యలు చేపడుతున్నారు. సహాయక బృందాల మధ్య పూర్తిస్థాయి సమన్వయంతో సహాయక చర్యలు వేగంగా కొనసాగుతున్నట్లు తెలియజేశారు. టన్నెల్ ప్రమాదం జరిగిన రోజు నుంచి నిరంతరాయంగా సహాయక చర్యలు కొనసాగుతున్నాయని, సహాయక చర్యల్లో భాగంగా సొరంగంలో ఉన్నటువంటి మట్టిని, టీబీఎం భాగాలను, ఊట నీటిని తొలగిస్తూ సహాయక చర్యలు వేగవంతం చేస్తున్నట్లు వెల్లడించారు.

## ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి ఉత్తమ్





**హుజూర్ నగర్, మహా :** హుజూర్ నగర్ నియోజకవర్గ కేంద్రంలో ఈ నెల 30వ తేదీ ఉగాది పండుగ రోజున సన్న బియ్యం పంపిణీ కార్యక్రమంకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన సందర్భంగా సభ ఏర్పాట్లను గురువారం రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పౌర సరఫరాల శాఖ కమిషనర్ చౌహాన్, జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, జిల్లా ఎస్పీ నరసింహ, జిల్లా ,నియోజకవర్గస్థాయి అధికారులు స్థానిక ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం పౌరసరఫరాల శాఖ కమిషనర్ చౌహాన్, జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ , ఎస్పీ నరసింహ, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులతో క్యాంప్ కార్యాలయంలో సీఎం సభ ఏర్పాట్లపై సమీక్ష చేశారు. అదేవిధంగా హుజూర్ నగర్ కౌండిన్య ఫంక్షన్ హాల్ లో కోదాడ , హుజూర్ నగర్ నియోజకవర్గాల కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించి సీఎం సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## మంత్రులకు స్వాగతం పలికిన మేయర్ కమిషనర్





**వరంగల్, మహా :** హనుమకొండ జిల్లా హసన్పర్తి మండలం దేవన్నపేట శివారులోని దేవాదుల పంపింగ్ స్టేషన్ పేజ్ 3 ప్యాకేజ్ 3 లో భాగంగా గురువారం ఏర్పాటుచేసిన నూతన మోటార్ల ద్వారా నీటి విడుదలను పరిశీలించేందుకు హెలికాప్టర్ ద్వారా హైదరాబాద్ నుండి నేరుగా దేవన్నపేట టోల్ గేట్ సమీపంలో ఏర్పాటు చేసిన హెలిపాడ్ వద్దకు రాష్ట్ర సాగునీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చేరుకోగా గ్రేటర్ వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి, ఎమ్మెల్యే కడియం శ్రీహరి తో కలిసి గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే లు పుష్పగుచ్చం అందించి ఘనంగా స్వాగతం పలికారు.

## వ్యవసాయ కళాశాలకు స్థల పరిశీలన చేసిన రెవెన్యూ,వ్యవసాయ అధికారులు



**హుజూర్ నగర్, మహా:** మఠంపల్లి మండలం రఘునాథపాలెం గ్రామ రెవిన్యూ పరిధిలోని 247 సర్వే నంబర్ లో గల ప్రభుత్వ భూమిని వ్యవసాయ కళాశాల నిర్మాణం కొరకు జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం జిల్లా వ్యవసాయ శాఖ ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తల ఆధ్వర్యంలో గురువారం భూమిని పరిశీలించడం జరిగింది. ఇట్టి నివేదికను జిల్లా కలెక్టర్ కు సమర్పిస్తామని అధికారులు తెలియజేశారు. ఇట్టి కార్యక్రమంలో తహసిల్దార్ మంగ, వ్యవసాయ అధికారి శ్రీనివాస్, మండల ఆర్ ఐ లు,సర్వేయర్లు మరియు రెవెన్యూ వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

## 90 శాతం మాఫీని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

### బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

**వరంగల్, మహా :** తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వము ఆస్తి పన్ను బకాయిల పై వడ్డీని 90 శాతం మాఫీ ప్రకటించినందున ఈ సువర్ణ అవకాశాన్ని నగర ప్రజలు సద్వినియోగం చేసుకొని ఈ నెల 31 తేదీలోగా పన్నులు చెల్లించాలని జీడబ్ల్యూఎం సి కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే కోరారు. పన్నులు బిల్ కలెక్టర్లు, వార్డ్ ఆఫీసర్ల ద్వారా, కార్యాలయ ఆన్లైన్ కౌంటర్ల ద్వారా, ఆన్లైన్ వెబ్సైట్ ద్వారా గాని లేదా మీసేవ కేంద్రాల ద్వారా, మై జిడబ్ల్యూఎంసి మొబైల్ యాప్ ద్వారా లేదా https://gwmc.gov.in/cdmataxenquiry.aspx ద్వారా కూడా చెల్లించవచ్చని కమిషనర్ తెలిపారు.

# మానవ అక్రమ రవాణా అరికట్టాలి

## శ్రీలత డిఆర్డిఓ






- తల్లి తండ్రి లేని యువతీ యువకులు టార్గెట్
- తొందరగా డబ్బు సంపాదించాలనే ఆశావాహులు
- మాయమాటలతో లోబడుచుకొని అక్రమ రవాణా


**రంగారెడ్డి జిల్లా, మహా :** మానవ అక్రమ రవాణాపై ఏపీఎంలకు, సీసీలకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం ఇవ్వడం జరిగింది. కొంగరకలాన్ రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శ్రీలత ఆధ్వర్యంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ప్రధానంగా మానవ అక్రమ రవాణా ఏ విధంగా జరుగుతుంది, ఎన్ని విధాలుగా జరుగుతోంది, ఏ రూపంలో జరుగుతుంది, ప్రధానంగా ఎవరు అక్రమ రవాణాకు గురి అవుతున్నారు, అనే అంశాలపై శిక్షణ ఇవ్వడం జరిగింది. ప్రధానంగా పేదరికంలో ఉన్న, వలస వచ్చిన కుటుంబాలు ఉద్యోగం కోసం అన్వేషిస్తున్న యువతలో పని కోసం ఎక్కువ డబ్బులు సంపాదించాలన్న ఆకృతి ఉన్న వారిని అక్రమ రవాణా ఆకర్షించి వారి మాయమాటలతో తొందరగా నమ్మించి, నగరాలలో ఉద్యోగం చేయిస్తూ ఎక్కువ సంపాదన చేయవచ్చు అని మాటలు విని, తల్లిదండ్రి లేని మైనర్ పిల్లలు గానీ పేదవారిని గాని నమ్మించి నగరాలకు వారి ప్రమేయం లేకుండా తరలించి లైంగిక అవసరాలకు బానిసత్వం వెట్టి చాకిరి గాని శ్రమ దోపిడీకి గాని అమ్మేయడం జరుగుతుంది. అట్టి బందీల నుండి విముక్తి పొందలేక పోవుచున్నారు. ఇలా 130 దేశాలలో అక్రమ రవాణా జరుగుతుందని, ప్రతి పది నిమిషాలకు ఒకరు గురవుతున్నారు. కావున జరిగిన సంఘటనలు స్క్రీనింగ్ ద్వారా చూపించడం జరిగింది. ఇలా జరగకుండా గ్రామ సంఘాలలో చిన్న సంఘాలు సభ్యులు అవగాహన కల్పించి, హెల్ప్ లైన్ ద్వారా అందరికీ తెలిసే విధంగా ప్రదర్శించాలి, టోల్ ఫ్రీ నెంబర్ 1930 ,100,104,1098,181, కావున పైన తెలుపబడిన నెంబర్లకు సమాచారం ఇవ్వవలసిందిగా, ప్రతి ఒక్కరికి తెలిసే విధంగా శిక్షణలో చర్యలు తీసుకురావాలని డిఆర్డిఓ శ్రీలత ఆదేశించినారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డిఆర్డిఓ పి సూర్యారావు, DPMs సిహెచ్ స్వర్ణలత, యాదయ్య, విలాస్ రావు, జిల్లా సమైక్య అధ్యక్షురాలు ఎం కవిత, టి ఓటిఎస్ ఏపిఎంలు రవీందర్ యాదగిరి విజయ మాలిని సిసిలు హాజరయ్యారు.

## సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వేస్లీ అరెస్ట్ ను తీవ్రంగా ఖండించిన మోత్కూరు మండలం కమిటీ

### ఇంటి స్థలం కోసం పోరాడితే లాఠీచార్జీ, అరెస్టులా



**మోత్కూర్, మహా:** యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మున్సిపల్ కేంద్రంలో ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని నాగన్‌పల్లి గ్రామంలోని సర్వే నంబర్లు 189, 203లో 577 మంది పేదలకు ఇంటి స్థలాల పట్టాలు వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వంలో మంజూరయ్యాయని సిపిఎం మండల కమిటీ పేర్కొంది. అయితే, ఈ భూములను రామోజీ ఫిల్మ్ సిటీ యాజమాన్యం కబ్జా చేసి, పేదలకు మరోచోట భూములను కేటాయిస్తామని చెప్పి మోసం చేశారని మండల కమిటీ ఆరోపించింది. సంవత్సరాలుగా వేచి చూసిన పేదలు తమకు కేటాయించిన భూముల్లోకి వెళ్లేందుకు యత్నించగా, పోలీసులు లాఠీచార్జీ చేసి, అరెస్టులు జరపడం అన్యాయమని సిపిఎం మోత్కూర్ మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు, మండల కమిటీ సభ్యులు కురిమేటి యాదయ్య పత్రికా ప్రకటనలో తెలిపారు. పేదల భూములను పేదలకే ఇవ్వాలని, డిమాండ్ చేస్తూ పోరాటం చేస్తున్న సిపిఎం నేతల అరెస్టును ఖండిస్తున్నామని వారు స్పష్టం చేశారు. పేదల హక్కుల కోసం పోరాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వేస్లీ, రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్యలను అరెస్ట్ చేయడం అన్యాయమని, మండల కమిటీ ఆగ్రహం వ్యక్తం చేసింది.







# కలెక్టర్లా.. కామన్ మ్యాన్ లా

## ఇది సార్.. మా బ్రాండ్.. మార్పుకు అంబాసిడర్లు

### జనంతో మమేకమవుతున్న జిల్లా కలెక్టర్లు.. జనంతో మమేకమవుతున్న జిల్లా కలెక్టర్లు

### ప్రభుత్వం ఇచ్చిన స్వేచ్ఛతో.. ప్రజల హృదయాల్లో ముద్ర

**కలెక్టర్లు అంటే.. బంగళాకే పరిమితమయ్యే ఉద్యోగం కాదు. జనంతో ఉండాలి. జనం బాధలు తెలుసుకోవాలి. సంక్షేమం చూడాలి. చదువు తీరు కనిపెట్టాలి. పథకాల అమలుకు వారిదే భారం. సంక్షేమానికి సాయానికి వారే ప్రభుత్వ కళ్ళు. తెలంగాణ ప్రభుత్వంలో .. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో ప్రభుత్వం ఏర్పడ్డాక జిల్లా కలెక్టర్లు కూడా తమ మార్క్ చూపిస్తున్నారు. అదిదా..సార్ అన్నట్లు మార్పుకు అంబాసిండర్లుగా కనబడుతున్నారు. ఓ జిల్లా కలెక్టర్ తెల్లవారుజామున నాలుగుగంటలకే ఓ పేదింటి విద్యార్థి తలుపుతట్టి చదువుతున్నాడా లేదా పరీక్షించి చదువు ప్రాధాన్యత చెప్పగా, మరో కలెక్టర్ సైకిల్ మీద, ఆర్టీసీ బస్సుల్లో తిరుగుతూ ప్రజలకు అందుతున్న సంక్షేమాన్ని, కోరికలను తెలుసుకుంటున్నారు. దశాబ్దాలుగా పేరుకుపోయిన సమస్యల పరిశీలనకు కొందరు, రోడ్డులేని ప్రాంతాలకు కూడా కిలోమీటర్ల దూరం కాలినడకన వెళ్ళి సమస్యల మూలాలు పడుతున్న మరికొందరు.. మొత్తంగా తెలంగాణలోని పలువురు జిల్లా కలెక్టర్ తమ ముద్ర బలంగా వేస్తున్నారు. మార్క్ చూపిస్తున్నారు. సమస్య ఉందని వినతి పత్రాలు తీసుకునే వచ్చే ప్రజల సమస్యలు ఓపిగ్గా విని.. వికలాంగులు ఉంటే.. నేలపై కూర్చొని వారి సమస్యలు వింటారు. హాస్టల్స్, అంగన్‌వాడి సెంటర్, స్కూల్స్ సందర్శించి పిల్లలతో మమేకమవుతారు.. స్టూడెంట్‌గా పాఠాలు వింటారు. ఉపాధ్యాయుడు పాత్రలో వారికి పాఠాలు బోధిస్తారు. క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజా సమస్యలను ప్రత్యేకంగా పరిశీలించి వాటిని పరిష్కరిస్తున్నారు. ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, యాదాద్రి కలెక్టర్ హన్మంతరావు, మెదక్ కలెక్టర్ రోహిత్ రాజ్ ఇలా పలువురు కలెక్టర్లు వినూత్న కార్యక్రమాలతో సేవకు మారుపేరుగా నిలుస్తున్నారు.**

**- మహా - నెట్ వర్క్**

## సింపుల్‌గా బస్సులో.. జనంతో రోహిత్

చిన్న ప్రభుత్వ ఉద్యోగం రాగానే కొంతమంది దర్పం ప్రదర్శిస్తుంటారు. కానీ ఎప్పుడు బిజీగా ఉండే ఓ జిల్లా కలెక్టర్.. తన సింప్లిసిటీ అంటే ఏంటో చూపించాడు. తన భార్యతో కలిసి ఒకటి కాదు రెండు 20 కిలోమీటర్ల మేర సైకిల్ తొక్కారు. మెదక్ నుండి రామయంపేట వరికు సైకిల్ తొక్కుతూ వెళ్లారు. రిటర్న్‌లో సాధారణ వ్యక్తిలాగా ఆర్టీసీ బస్సులో ప్రయాణించారు. మెదక్ జిల్లా రామాయంపేటలో మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ఆకస్మికంగా పర్యటించారు. ఓ ఆదివారం ఉదయం మెదక్ జిల్లా కేంద్రం నుండి 20 కిలోమీటర్ల మేర సైకిల్ పై ప్రయాణం చేసిన కలెక్టర్ రామయంపేట ఆర్టీసీ బస్టాండ్ ను సందర్శించారు. మెదక్ ఆర్టీసీ డిపో మేనేజర్ సురేఖతో కలిసి ఆర్టీసీ బస్టాండ్ నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వేసవికాలం దృష్ట్యా ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. ఆర్టీసీ బస్టాండ్‌లో నెలకొన్న సమస్యలను పరిశీలించి త్వరలోనే సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఆర్టీసీ బస్సులో మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు జిల్లా కలెక్టర్ రాహుల్. తిరిగి మెదక్‌కు సామాన్య ప్రయాణికుడి లాగా తన భార్యతో కలిసి ఆయన ఆర్టీసీ బస్సులో ప్రయాణం చేసి మెదక్ వెళ్లారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహాలక్ష్మి పథకం ద్వారా ఉచిత బస్సు ప్రయాణం కల్పించినందున మహిళలు 70శాతం మేర ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్నారని తెలిపారు. వారికి మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. ఏది ఏమైనా ఓ జిల్లా కలెక్టర్ ఇలా సైకిల్ పై రావడం.. మళ్ళీ బస్సులో అందరితో కలిసి సింపుల్ గా వెళ్లడం చూసి అందరూ షాక్ అయ్యారు.

## ఖమ్మంలో ఆడపిల్లకు స్వీట్ బాక్స్..

### ముజమ్మిల్ ఖాన్ వినూత్న ప్రయత్నం

వినూత్న కార్యక్రమాలకు ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ పెట్టిందిపేరు. ఆయన పొలం గట్లమీద తిరిగి రైతు సమస్యలు తెలుసుకుంటారు. పాఠశాలకు వెళ్ళి విద్యార్థిలా మారిపోతారు. వారి సమస్యలు తెలుసుకుంటూ పరిష్కరించడమే కాకుండా చదువువిలువ చెబుతారు. ఎవరూ వెళ్ళలేని ప్రాంతాలకు వెళ్ళి.. టూరిజాన్ని కొత్త పుంతలు తొక్కించే ప్రణాళికలు రచిస్తారు. ఆడపిల్ల పుట్టిందని తల్లిదండ్రులు ఆ శిశువును ప్రసవించిన ఆసుపత్రిలో వదిలి వెళ్లిన ఘటనలు ఎన్నో చూశాము. ఆడ పిల్ల పుట్టిందని వదిలి వెళ్లిన ఘటనలు ఖమ్మం నగరంలో గతంలో జరిగింది. తల్లి వదిలి వెళ్లగా పాల కోసం ఆ చిన్నారి గుక్క పట్టి ఏడుస్తుంటే గమనించిన ఆసుపత్రి నర్సులు ఆ శిశువును ఖమ్మంలోని శిశుగృహానికి తరలించారు. ఇలాంటి ఘటనలు ఖమ్మం జిల్లా లోనే పలు ప్రాంతాల్లో జరుగుతున్న నేపథ్యంలో ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ కీలక నిర్ణయం తీసుకున్నారు. 'గర్ల్ ప్రైడ్' పేరిట ఓ సరికొత్త కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఖమ్మం జిల్లాలో ఆడపిలల్ల పుట్టిన ఇంటికి జిల్లా అధికారులు వెళ్లి వారింట్లో మిఠాయి బాక్సు ఇచ్చి శుభాకాంక్షలు చెప్పాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్. తాజాగా జిల్లా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఆడపిల్ల ఇంటికి లక్ష్మి అని అమ్మాయి పుట్టడం శుభ సూచకమని ప్రజల్లో ప్రచారం చేసేందుకు తాను ఈ పథకాన్ని ప్రారంభించానని ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. ఈ గర్ల్ ప్రైడ్ కార్యక్రమం కోసం జిల్లా అధికారుల పర్యటనలను కూడా ప్రారంభించారు. ఆడపిల్ల జన్మించడం ఆ తల్లి దండ్రులకు గర్వకారణంగా భావించేలా కలెక్టరు స్వీట్ బాక్సును అధికారులతో వారి ఇళ్లకు పంపించడానికి చర్యలు తీసుకున్నారు. ఆడపిల్ల పుడితే సమాజంలో ఉన్న పక్షపాతం పోగొట్టే సంస్కృతిని పెంపొందించడానికి ఈ కార్యక్రమాన్ని చేపట్టామని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ చెప్పారు. ఆడపిల్లల ప్రాముఖ్యతను ప్రోత్సహించడంతో పాటు సామాజిక దృక్పథాన్ని మార్చడానికి తాను ఈ కొత్త కార్యక్రమాన్ని అమలు చేస్తున్నానని అన్నారు.



## విద్యార్థులపై అభిలాష ముద్ర



కలెక్టర్ హోదాలో నిత్యం వివిధ శాఖల అధికారులతో సమీక్షలు, క్షేత్ర పర్యటనలతో బిజిబిజిగా ఉండే ఆ జిల్లా కలెక్టర్ తనిఖీలు చేస్తూ హడలెత్తిస్తున్నారు. విద్యార్థులతో మమేకమై.. లెక్కల చిక్కులు విప్పే మాస్టార్లవుతున్నారు. నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ క్షేత్ర పర్యటనలో భాగంగా జిల్లాలోని పాఠశాలలు, వసతి గృహాలను సందర్శిస్తూ విద్య, వైద్యం, ఆరోగ్యం గురించి వాకబు చేస్తున్నారు. ఓ పాఠశాల తనిఖీకి వెళ్ళి తరగతి గదిలో బోర్డుపై గణితం బోధించారు. సూత్ర బద్ధంగా లెక్కల చిక్కులను ఎలా విప్పాలో విద్యార్థులకు స్వయంగా బోర్డు పై లెక్కలు చేసి చూపించి అవగాహన కల్పించారు. విద్యార్థులతో బోర్డుపై లెక్కలు చేయించి సబ్జెక్టుపట్ల వారికున్న భయాన్ని పోగొట్టారు. గణితంతోపాటు సౌరకుటుంబం గురించి, ఇతర విషయాల గురించి అక్కడి విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. కలెక్టర్ అభిలాష క్షేత్రస్థాయి పర్యటనలతో హాస్టల్స్ సమస్యలకు, హాస్టల్స్ పై క్రియేట్ చేసిన భయాలకు చెక్ పడింది. ఇతర సమస్యలపైనా ఆమె తనదైన ముద్రవేస్తూ క్షేత్రంలోకి దూసుకెళ్తున్నారు.

## హన్మంత రావు సార్.. మీరు గ్రేట్



"నేను జిల్లా కలెక్టర్‌ను.. ఇప్పుడే నిద్ర లేస్తున్నారా.. నల్లాల్లో సరిపడా తాగునీళ్లు వస్తున్నాయా.. మురుగు కాలువలను, రోడ్లు పారిశుధ్య సిబ్బంది శుభ్రం చేస్తున్నారా" అని ఆ కలెక్టర్ సామాన్యుల ఇళ్ళకు , వీధులకు వెళ్ళి అడిగి తెలుసుకుంటారు. హాస్టళ్ళలో నిద్రిస్తారు. విద్యార్థులతో కలిసి భోజనం చేస్తారు. వారికి పెట్టే ఆహారం, పదార్థాలను తరచూ పరిశీలిస్తారు. పాఠశాలలకు ఆకస్మికంగా వెళ్ళిపోతారు. కలెక్టర్ గా ఆయన తన బాధ్యతలను నిర్వహిస్తూనే విద్యార్థుల బాగోగులను పట్టించుకోవడం పై ప్రశంసల జల్లు కురుస్తుంది. భరత్ అనే పదో తరగతి విద్యార్థి ఇంటికి తెల్లవారుజామున వెళ్లిన జిల్లా కలెక్టర్ చదువుపై ఆరా తీసి ఓ కలెక్టర్ ఇలా చేయవచ్చా అంటూ ఆశ్చర్యపరిచారు. తనకు గ్యాస్ సబ్సిడీ రావడం లేదని స్థానికుడు ఫిర్యాదు చేయగా కలెక్టర్ అక్కడినుంచే సివిల్ సప్లయ్ అధికారులకు ఫోన్ చేసి లబ్ధిదారుకు గ్యాస్ సబ్సిడీ అందేలా చూడాలని ఆదేశించారు. అలాగే 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగిస్తున్న వారందరికీ గృహజ్యోతి వర్తించేలా చర్యలు చేపట్టాలంటూ అక్కడి నుంచే ట్రాన్స్‌కో ఎస్ఈకి వాట్సాప్ లో ఆదేశాలు జారీచేశారు. ఓసారి భువనగిరిలోని ఎస్టీ పోస్ట్‌మెట్రిక్ హాస్టల్‌ను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాత మెనూ అమలు చేస్తున్న విషయం తెలుసుకొని వార్డెన్‌కు విజయలక్ష్మికి షోకాజ్‌నోటీసు జారీ చేశారు. షోకాజ్‌నోటీసులు ఇచ్చినా మారకపోవడంతో వార్డెన్ విజయలక్ష్మిని సస్పెన్షన్ చేస్తూ కలెక్టర్‌ఆదేశాలు జారీ చేశారు.

## ఆ కలెక్టర్ రూటే సపరేటు







## వృక్షశాస్త్రంలో ములుగు యువకుడికి డాక్టరేట్

**ములుగు, మహా :** ములుగు మండలం దేవగిరిపట్నం గ్రామానికి చెందిన పోరిక రమేష్ వృక్షశాస్త్రంలో డాక్టరేట్ పొందాడు. గ్రామానికి చెందిన పోరిక బుల్లిబాయి, జుమ్మిలాల్ దంపతుల కుమారుడైన రమేష్ ఉస్మానియా యూనివర్సిటీలో పీహెచ్డీ చేశాడు. నల్లమల అడవిలో కనిపించే అరుదైన ఔషధ మొక్క ఆర్గిరియా క్యూనియాటా యొక్క మధుమేహ నిరోధక లక్షణాలపై ఆయన చేసిన పరిశోధనకు గాను యూనివర్సిటీ అధికారులు పట్టా అందజేశారు. ఓయూలోని మాలిక్యులర్ జెనెటిక్స్ అండ్ బయోటెక్నాలజీ లాబొరేటరీలో అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ బి.కిరణ్ కుమార్ పర్యవేక్షణలో స్టడీస్ ఆన్ ఫైటోకెమికల్ ప్రొఫైలింగ్ అండ్ దేర్ బయోలాజికల్ యాక్టివిటీస్ ఆఫ్ ఆర్గిరియా క్యూనియాటా (విల్డ్) కెర్ గాల్ అనే అంశంపై చేసిన పరిశోదనకు గాను ఉస్మానియా విశ్వవిద్యాలయంలో రమేష్ డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ డిగ్రీని పొందాడు. రమేష్ కు డాక్టరేట్ రావడంపట్ల యూనివర్సిటీ వృక్షశాస్త్రం విభాగం ప్రొఫెసర్స్, ఉద్యోగులు, తోటి పరిశోదకులు అభినందనలు తెలిపారు.

## రామోజీ ఫిలిం సిటీ యాజమాన్యంపై నిరసన సెగలు

- 60 గజాల చొప్పున 600 మంది లబ్ధిదారులు
- పేదల భూములను, ఇళ్ల స్థలాలను ఇప్పించాలి
- రామోజీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి
- సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు డి కిషన్




**రంగారెడ్డి జిల్లా, మహా :** పేదల భూములను, ఇళ్ల స్థలాలను ఇప్పించాలి, రామోజీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి, డి కిషన్ సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. పేదల ప్రభుత్వ భూములను ఆక్రమించిన రామోజీ యాజమాన్యంపై చట్టపరమైన కేసులు పెట్టాలని, పట్టాలు పొందిన పేదలకు వెంటనే ఇండ్ల స్థలాలు చూపించాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యంలో నిన్న పట్టాలు పొందిన నిరుపేదలంతా వాళ్ళ వాళ్ళ ఇండ్ల జాగాల్లోకి శాంతియుతంగా వెళుతున్న సందర్భంగా సిపిఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ గారిపై, జిల్లా నాయకులపై మరియు నిరుపేదలపై, ప్రభుత్వ అండదండలతో పోలీసులు సాగించిన నిర్బంధకాండను, అక్రమ కేసులను తీవ్రంగా ఖండిస్తూ సిపిఎం పార్టీ తుర్కయంజాల్ మున్సిపల్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం స్థానిక అంబేద్కర్ చౌరస్తా వద్ద నిరసన తెలియజేయడం జరిగింది ఈ సందర్భంగా సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు, తుర్కయంజాల్ మున్సిపాలిటీ కార్యదర్శి డి కిషన్ మాట్లాడుతూ రామోజీ ఫిలింసిటీ దగ్గర ప్రభుత్వ భూములలో నాగన్ పల్లి, పోల్కంపల్లి, రాయపోల్, ఏనుగల్ గూడా, ముకునూరు గ్రామాలకు చెందిన సుమారు 600 మంది నిరుపేదలకు 60 గజాల చొప్పున 2007వ సంవత్సరంలో వైయస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో సుమారు 20 ఎకరాల్లో లేఅవుట్ చేసి పట్టాలు ఇచ్చారని, అప్పటినుండి ఈ నిరుపేదలు ఆ భూమిలో ఇండ్లు నిర్మించుకుందామనే ప్రయత్నం ఎప్పుడు చేసినా రామోజీ యాజమాన్యం అడ్డుపడిందని, అంతేకాకుండా అక్రమంగా ప్రహరీ గోడ నిర్మించి నిరుపేదలను తమ ఇంటి స్థలాల్లోకి రానివ్వకుండా ఇబ్బందులు పెట్టిందని అన్నారు. ఇంత నగ్నంగా రామోజీ యాజమాన్యం గత 18 సంవత్సరాలుగా వందలాదిమంది నిరుపేద కుటుంబాల ప్రజలని ఇబ్బందులు పెట్టడం జరుగుతుంది. ప్రభుత్వ భూమిని యదేచ్ఛగా కబ్జా చేస్తుంటే పాలకవర్గాలు కళ్లప్పగించి చూస్తున్నాయే తప్ప రామోజీ యాజమాన్యంపై మాత్రం ఎలాంటి చర్యలకు పూనుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా నిరుపేదలకు కేటాయించిన ప్రభుత్వ భూమిలోని ఇళ్ల స్థలాల్లో ప్రభుత్వమే నేరుగా ఇల్లు కట్టించి ఇవ్వాలని సిపిఎం నాయకులపైన అక్రమంగా పెట్టిన కేసులను ఎత్తివేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ తుర్కయంజాల్ మున్సిపల్ కమిటీ సభ్యులు జే ఆశీర్వాదం, ఎం సత్యనారాయణ, బడుగు మాల్యాద్రి, పీ శ్రీనివాసులు, ఐ కృష్ణ, బడుగు శంకరయ్య, ఏ మాధవరెడ్డి, ఎం యాదయ్య, ఎన్ యాదగిరి, హనుమంత్ రెడ్డి, ధర్మారెడ్డి రాజు, లింగారెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ, ఎస్టీల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం - కమీషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

- కమీషన్ సభ్యులతో కలిసి ఆదిలాబాద్ పర్యటన
- జిల్లా అధికారులతో సమీక్షా సమావేశం






**ఆదిలాబాద్, మహా :** ఎస్సీ, ఎస్టీ కేసులు పెండింగ్‌లో లేకుండా వచ్చే ఏప్రిల్ మాసంలోగా పరిష్కరించాలని, బాధితులకు సత్వర న్యాయం చేకూర్చేవిధంగా చర్యలు చేపట్టాలని తెలంగాణ ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మెన్ బక్కి వెంకటయ్య అన్నారు. ఆదిలాబాద్ జిల్లాలో కమిషన్ సభ్యులు కుస్రం నీలాదేవి, కొంకటి లక్ష్మీనారాయణ, రాంబాబు నాయక్, రేణికుంట్ల ప్రవీణ్, జిల్లా శంకర్‌లతో కలిసి పర్యటించారు. స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన సమీక్షా సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. చైర్మన్ కమీషన్ సభ్యులకు జిల్లా అధికారులు పూలమొక్కలు అందజేసి ఘన స్వాగతం పలికారు. పోలీసుల గౌరవ వందనం అనంతరం చైర్మన్ వెంకటయ్య ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల పురోగతి, ఆయాశాఖల ద్వారా చేపడుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలలో ఎస్సీ, ఎస్టీలకు కల్పిస్తున్న ప్రాధాన్యత, శాఖల్లో నెలకొన్న సమస్యలు, క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న ఇబ్బందులు, వస్తున్న నిధులు, తదితర అంశాలపై అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు. ఆయాశాఖల ఉన్నతాధికారుల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకున్నారు. అవసరమైన సూచనలు చేశారు. తీసుకోవాల్సిన చర్యలపై దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కమిషన్ చైర్మెన్ బక్కి వెంకటయ్య మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీల సంక్షేమమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతోందని, వారికి తగిన ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ కేసుల విషయంలో తమకు అనేక ఫిర్యాదులు అందాయని, సంబంధితశాఖ అధికారులు వాటిపై ప్రత్యేక దృష్టిసారించాలని అన్నారు. బాధితులకు న్యాయం జరిగే విధంగా సమగ్ర విచారణ జరపాలని, నిజనిజాలను నిగ్గుతేల్చి నిందితులకు కఠిన శిక్షలు పడేలా చార్జిషీట్లు దాఖలు చేసి కేసులను కోర్టు వరకు తీసుకెళ్లాలని అన్నారు. వచ్చే ఏప్రిల్ మాసం చివరికల్లా కేసులు పెండింగ్‌లో లేకుండా చూడాలని ఆదేశించారు. అదేవిధంగా పలు శాఖల ఆధ్వర్యంలో చేపట్టే కార్యక్రమాలలో ఎస్సీ, ఎస్టీలకు సముచిత స్థానం కల్పించాలన్నారు. అవుట్ సోర్సింగ్ ఏజెన్సీలలో అవకాశాలు కల్పించి ప్రోత్సహించాలని సూచించారు. వెనుకబడిన ఆదిలాబాద్ జిల్లాలో ఆదివాసీ గిరిజనులే అధికంగా ఉన్నారని, ప్రభుత్వం వారి సంక్షేమం, అభివృద్ధి పట్ల చిత్తశుద్ధితో ఉందన్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను సక్రమంగా వినియోగించి ఆదివాసీలు, దళితుల ఆర్థికాభివృద్ధికి పాటుపడాలని అన్నారు. క్షేత్రస్థాయిలో ఏమైన సమస్యలుంటే తమ దృష్టికి తేవాలని, వాటి పరిష్కారం కోసం తమవంతుగా కృషి చేస్తామని స్పష్టం చేశారు. అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ ప్రజలకు భరోసా కల్పించేలా నిబద్ధతతో పనిచేయాలన్నారు. మంచి పేరు తెచ్చుకోవాలని సూచించారు. అనంతరం ఆదిలాబాద్ జిల్లా సహకార సెంట్రల్ బ్యాంకు లిమిటెడ్ అధికారులు, ఆర్ ఓఆర్ పై సమీక్షా సమావేశం నిర్వహించారు. కమిషన్ సభ్యులు ఆర్ ఓ ఆర్ సమస్యల గురించి దిశానిర్దేశం చేసారు. పలు సమస్యలపై అర్జీలను స్వీకరించారు.

## పేదల ఇళ్ల స్థలాల సమస్య పరిష్కరించాలి

- రాచకొండ సిపిని కలిసిన జాన్ వెస్లీ.. రామోజీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి పేద ప్రజల ఇళ స్థలాలను ఇప్పించాలి



**రంగారెడ్డి జిల్లా, మహా :** రామోజీ యాజమాన్యం ఆక్రమించుకున్న పేదల ఇళ్ల స్థలాలపై గురువారం రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్ బాబును కలిసిన సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, రాష్ట్ర నాయకులు డీజి నరసింహ రావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సామెల్ సమస్యను పరిష్కరించాలని తెలిపారు. సిపిఎం ఆశ కార్యదర్శి జాన్ వెస్లీ మాట్లాడుతూ.... దివంగత ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి హయాంలో సుమారు 20 ఎకరాల భూమిలో, 60 గజాల చొప్పున 600 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను మంజూరు చేశారు. కాలక్రమేనా ప్రస్తుతం ఈ యొక్క ప్రభుత్వ భూమిలో రామోజీ ఫిలిం సిటీ యాజమాన్యం ఆక్రమించడం జరిగింది. ఈనెల 26న రామోజీ ఫిలిం సిటీలోని ఇళ్ల స్థలాల వద్దకు వెళ్లిన ప్రజలపై దౌర్జన్యంగా పోలీసులతో కేసులు పెట్టించారు. రామోజీ ఫిలిం సిటీ యాజమాన్యం ప్రవర్తిస్తున్న తీరును తీవ్రంగా ఖండిస్తున్నామని, దీనిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, పేదల ఇంటి స్థలాలు ఇప్పించాలని రాచకొండ సిపీ సుధీర్ బాబును కోరడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా మహేశ్వరం డిసిపి సునీత రెడ్డి, ఇబ్రహీంపట్నం మండల కార్యదర్శి బుగ్గరాములు, జిల్లా కమిటీ సభ్యులు జంగయ్య, జగన్, మండల నాయకులు ఆనంద్ పాల్గొన్నారు.

## శంషాబాద్ మున్సిపాలిటీలో పర్యటించిన కమిషనర్ రంగనాథ్

- రెండున్నర ఎకరాల ప్రభుత్వ భూమి కబ్జాకు గురైనట్లు గుర్తించారు
- ప్రభుత్వ భూమి కబ్జా చేసినట్లయితే క్రిమినల్ కేసులు



**రంగారెడ్డి జిల్లా, మహా:** శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని తొండుపల్లి గ్రామంలో హైడ్రా కమిషనర్ రంగనాథ్ పర్యటించారు. రెండున్నర ఎకరాలు గల ప్రభుత్వ భూమిని కొందరు వ్యక్తులు కబ్జా చేస్తున్నారని వచ్చిన పిర్యాదు మేరకు వెంటనే స్పందించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్ ప్రభుత్వ భూమిని సందర్శించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... రంగారెడ్డి జిల్లా, శంషాబాద్ మండలం, తొండుపల్లిలోని సర్వేనెంబర్ 108, 109 రెండున్నర ఎకరాలు గల ప్రభుత్వ భూమిని కొందరు వ్యక్తులు కబ్జా చేసి, ఆక్రమించిన భూమిలో అక్రమంగా వెంచర్ చేస్తున్నారని వచ్చిన పిర్యాదు మేరకు గురువారం ఆక్రమణ గురైన భూమిని సందర్శించడం జరిగిందని తెలిపారు. తొండుపల్లి గ్రామంలో రెండున్నర ఎకరాలు ఎకరాల ప్రభుత్వము కబ్జా చేసినట్లు గుర్తించారు. ఇలాంటి ప్రభుత్వ భూములపై కబ్జా చేస్తే ఊరుకునే ప్రసక్తి లేదని, కఠినమైన చర్యలు తీసుకుంటామని సూచించారు. శంషాబాద్ పరిధిలో గొల్లపల్లి వెళ్లే రోడ్డు ప్రక్కల ఉన్న స్మశానంలో అక్రమ హోర్డింగ్‌లు వెలుస్తున్నాయని వాటిని కూడా తొలగిస్తామని అన్నారు. గతంలో కూడా శంషాబాద్ మున్సిపాలిటీలో కొన్ని ప్రభుత్వ భూములకు పర్యవేక్షించామని వాటిపై కూడా త్వరలో చర్యలు తీసుకుంటామని, ప్రభుత్వ భూమిలో అక్రమ లేఔట్ చేసిన వారిపై క్రిమినల్ కేస్ చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## జర్నలిస్టులకు రాయితీ కల్పించి ఆదుకోండి

### ఎంపీ వద్దిరాజు రవిచంద్ర




**వరంగల్, మహా :** రైల్వేలో జర్నలిస్టుల రాయితీ పథకాన్ని పునరుద్ధరించాల్సిందిగా రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. జర్నలిస్టులలో చాలా వరకు తక్కువ,మధ్య తరగతి వర్గాలకు చెందిన వారేనని, తమ విధి నిర్వహణలో భాగంగా ప్రతినిత్యం రైళ్లలో ప్రయాణాలు చేస్తుంటారన్నారు.ఎంపీ వద్దిరాజు రాజ్యసభలో గురువారం మాట్లాడుతూ, కోవిడ్ కారణంగా ఎత్తివేసిన రాయితీ పథకాన్ని తిరిగి ప్రవేశపెడుతూ వారిపై ఆర్థిక భారం పడకుండా సాయం చేయాల్సిందిగా రైల్వే మంత్రిత్వ శాఖను కోరారు.రైలు ప్రయాణాల సందర్భంగా గతంలో మాదిరిగా 50% రాయితీని పునరుద్ధరించాల్సిందిగా పాత్రికేయులు,వారి సంఘాలు మూడేళ్లుగా కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తులు చేస్తుండడాన్ని ఈ సందర్భంగా ఎంపీ వద్దిరాజు గుర్తు చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో నాలుగో స్థంభంగా సమాజానికి తమ విలువైన సేవలందిస్తున్న జర్నలిస్టులకు రైల్వే టిక్కెట్లలో 50% రాయితీ కల్పించడమనేది సమంజసం, సముచితమని ఎంపీ రవిచంద్ర తెలిపారు.

## ఆర్ టి సి బస్సుల్లో డిజిటల్ చెల్లింపులకు శ్రీకారం




**కాటారం, మహా :** రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ బస్సుల్లో ప్రయాణికుల సౌకర్యం కోసం డిజిటల్ చెల్లింపులకు శ్రీకారం చుట్టింది. ఆధునిక ప్రపంచంలో అందరూ అన్నింటిలోనూ డిజిటల్ చెల్లింపులు జరుగుతున్న సమయంలో ఆర్టీసీలో కండక్టర్లు , వన్ మెన్ సర్వీసులో డిజిటల్ చెల్లింపుల కోసం ప్రయాణికులు నిన్నటి నుండో ప్రశ్నిస్తూనే ఉన్నారు. మొదటగా కొన్ని సర్వీస్లలో క్రెడిట్ డెబిట్ కార్డుల చెల్లింపుల సౌకర్యం ఉన్నప్పటికీ డిజిటల్ చెల్లింపు లేకపోవడంతో అందరికీ అందుబాటులో లేకుండా పోయింది. నూతనంగా చలో అనే యాప్ ద్వారా బస్సులలో ఎలక్ట్రానిక్ టికెట్ ఇష్యూ (ఈ టిమ్ ) మిషన్లను ఆర్టీసీ సంస్థ ప్రవేశ పెట్టింది. దీని ద్వారా ప్రయాణికుల దగ్గర లేదా కండక్టర్ల వద్ద టికెట్ కు సరిపడా చిల్లర లేక అటు ప్రయాణికులకు కండక్టర్లకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. డిజిటల్ చెల్లింపుల ద్వారా చిల్లర సమస్యకు ఇబ్బందులు ఉండవు. ఈ టిమ్స్ tho ఫోన్ పే గూగుల్ పే, స్వైపింగ్ ద్వారా టికెట్ తీసుకునే సౌకర్యం అందుబాటులోకి తీసుకొచ్చారు ప్రస్తుతం అన్ని రంగాల్లో డిజిటల్ చెల్లింపులు పరిపాటిగా మారింది ఈ క్రమంలో ఆర్టీసీ కూడా ఈ విధానంపై కొన్ని నెలలుగా కసరత్తు మొదలు పెట్టింది దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల్లో ప్రయోగాత్మకంగా అమల్లోకి తీసుకువచ్చింది విజయవంతం కావడంతో అన్ని బస్సుల్లో అమలుకు కార్యాచరణ రూపొందించారు. బస్సులతోపాటుగా టికెట్ రిజర్వేషన్ కేంద్రాలు బుకింగ్ ఏజెన్సీల వద్ద ప్రారంభించనున్నారు వరంగల్ జిల్లా భూపాల పల్లి బస్ డిపో కు 66 ఈటిమ్స్ మిషన్లు వచ్చాయి. ఓ పి ఆర్ ద్వారా అమలు చేస్తున్నాం ఏ సునంద డిపో మేనేజర్, భూపాలపల్లి భూపాలపల్లి బస్ డిపోకు వచ్చిన ఈ టీమ్స్ మిషన్లతో ఆన్లైన్ పేమెంట్స్ రిజర్వేషన్ గల తొమ్మిది సర్వీసులలో మొదటగా ప్రవేశ పెట్టాం. విడతలవారీగా అన్ని సర్వీసులలో అందుబాటులోకి తీసుకు వస్తాం.



## ఘనంగా తెలుగు మాస్టర్ ఉద్యోగ విరమణ సన్మానం

**తొర్రూరు, మహా :** మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలంలోని హరిపిరాల ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ తెలుగు బోధిస్తున్న తండాల చంద్ర ప్రకాష్ గౌడ్ ఉద్యోగ విరమణ సన్మానోత్సవ కార్యక్రమాన్ని గురువారం పాఠశాల ఆవరణంలో హెచ్ఎం బి. వెంకటేశ్వరరావు అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు మాస్టర్ చంద్ర ప్రకాష్ శోభారాణి దంపతులను ఘనంగా సన్మానించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో పాఠశాల హెచ్ఎం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగికి ఉద్యోగ విరమణ సహజమన్నారు. తెలుగు ఉపాధ్యాయుడు చంద్ర ప్రకాష్ తన సర్వీస్ లో ఎంతోమంది విద్యార్థులను ఉన్నత పౌరులుగా తీర్చిదిద్దాడని కొనియాడారు. విద్యారంగా అభివృద్ధికి ఆయన చేసిన సేవలు మరువలేవన్నారు. తెలుగు మాస్టర్ చంద్ర ప్రకాష్ మాట్లాడుతూ సమాజంలో ఉపాధ్యాయ వృత్తి ఎంతో గౌరవప్రదమైందని, ఈ వృత్తిలో విద్యార్థులకు సేవలందించి పదవీ విరమణ పొందుతుండటం ఆనందంగా ఉందన్నారు. అనంతరం విద్యార్థులు చేసిన నృత్య ప్రదర్శనలు, ఆటపాటలు అందరిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఎం. రవి, సుధాకరా చారి, మధుకర్ రెడ్డి, రాజేశ్వర్, నారాయణ, కుమార్, సంపత్ కుమార్, శంకర్, సంపత్, రవీందర్ , తస్లీమా మహేందర్, ఆంజనేయులు, పిడి రాజు, రవి, మౌనిక, ఉపాధ్యాయులు, బంధుమిత్రులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

### పుష్కరాల పనుల కోసం

## డిస్ట్రిక్ట్ టాస్క్ ఫోర్స్ కమిటీ అభివృద్ధి పనుల పై ప్రతి వారం పరిశీలన



**కాటారం, మహా :** త్రివేణి సంగమం త్రిలింగ క్షేత్రం.. మూడు నదులకు పుష్కరాలకు వేదికైన ప్రసిద్ధ పుణ్యక్షేత్రం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరంలో సరస్వతి నది పుష్కరాల అభివృద్ధి పనుల కోసం డిస్టిక్ టాస్క్ ఫోర్స్ కమిటీని ఏర్పాటు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న సరస్వతీ పుష్కరాల గురువారం సరస్వతి పుష్కరాల ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో ఐడిఓసి కార్యాలయం నుండి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నిర్ణీత సమయానికి పుష్కరాల పనులను పూర్తి చేయడం కోసం డిస్ట్రిక్ట్ టాస్క్ ఫోర్స్ కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇరిగేషన్ అధికారులు వి‌ఐపి పుష్కర ఘాట్ పనులను త్వరిత గతిన పూర్తి చేయాలని ఆదేశించారు. పుష్కర ఘాట్‌లో స్నానఘట్టాలు, బట్టలు మార్చుకునే గదులు, చలువ పందిళ్ళ ఏర్పాటుతో పాటు గోదావరి తీరంలో తాత్కాలిక రోడ్డు నిర్మాణ పనులను వేగవంతం చేయాలని సూచించారు. పంచాయితీ రాజ్ శాఖ ద్వారా నిర్మాణం చేపట్టిన రోడ్డు నిర్మాణ పనులను త్వరిత గతిన పూర్తి చేయాలని స్పష్టం చేశారు. మిషన్ భగీరథ ద్వారా మంచినీటి ట్యాంకు నిర్మాణం పైపులైను ఏర్పాటు, పార్కింగ్ స్థలాల వద్ద నీటి సౌకర్యం, తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని తెలిపారు. టూరిజం శాఖ ద్వారా టెంట్ సిటీ ఏర్పాటు చేయనున్నందున వివిధ పరిశ్రమల టెంట్ సిటీ ఏర్పాటు కు స్థల సేకరణ చేపట్టాలని తెలిపారు. దేవాదాయ శాఖ ద్వారా చేపట్టిన పనులను ఏప్రిల్ నెలాఖరు వరకు పూర్తి చేయాలని ఆదేశించారు. విద్యుత్ శాఖ ట్రాన్స్ఫార్మర్ ల ఏర్పాటు, కరెంట్ పోల్స్ మార్చుట, ఏర్పాటు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. పంచాయితి శాఖ ద్వారా పారిశుద్ధ్య పనులు చేపట్టాలని అదనపు సిబ్బందిని నియమించాలని తెలిపారు. తాత్కాలిక ఆర్.టి.సి బస్టాండ్ నిర్మాణ పనులు చేపట్టాలని అధికారులు తమ తమ పనుల వద్ద క్షేత్ర స్థాయిలో పర్యటించి ఏప్రిల్ 30 వరకు పూర్తి చేయాలని ఆదేశించారు. టాస్క్ ఫోర్స్ కమిటీ ద్వారా ప్రతి వారం సమావేశాలు నిర్వహించడం జరుగుతుందని ప్రతి అధికారి నిబద్ధతతో జరుగుతున్న పనులు పర్యవేక్షణ చేస్తూ ఉండాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.

## ఉద్యోగుల పి.ఎఫ్, ఈఎస్ఐ సకాలంలో చెల్లించాలి

### వారధి సర్వసభ్య సమావేశంలో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి



**కరీంనగర్, మహా:** వారధి సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులందరి ప్రావిడెంట్ ఫండ్, ఈఎస్ఐ క్రమం సకాలంలో చెల్లించాలని సొసైటీ చైర్ పర్సన్, జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. కరీంనగర్ వారధి సొసైటీ పదవ వార్షిక సర్వసభ్య సమావేశం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో గురువారం జరిగింది. సొసైటీ చైర్ పర్సన్, కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ కరీంనగర్ జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించే ఉద్దేశంతో వారధి సొసైటీ 2015 లో ప్రారంభమైందని అన్నారు. ఇప్పటివరకు 85 వేల 129 మంది ఉపాధి, ఉచిత శిక్షణ కోసం ఆన్లైన్ రిజిస్ట్రేషన్లు చేసుకున్నారని తెలిపారు. వారధి సొసైటీ ఆరు జిల్లాల పరిధిలో సేవలు అందిస్తోందని అన్నారు. సొసైటీలో ఉన్న ఉద్యోగులందరికీ సకాలంలో ప్రావిడెంట్ ఫండ్, ఈఎస్ఐ చెల్లించాలని సూచించారు. 2 వేల 997 మంది ఈ సంస్థ ద్వారా ప్రత్యక్ష ఉపాధి పొందుతున్నారని తెలిపారు. ఈ ఏడాది 186 మందికి ప్రత్యక్ష ఉపాధి కల్పించినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, ప్రజల అవసరాల కోసం వారధి చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని అన్నారు. ఈ సందర్భంగా వారధి సొసైటీ మెంబర్ సెక్రటరీ ఆంజనేయులు సంస్థ వార్షిక ఆదాయవ్యయాలను సభ్యులకు వివరించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ వెంకటేశ్వర్లు, డి ఆర్ డి ఓ శ్రీధర్, జడ్పీ సీఈవో శ్రీనివాస్, వారధి సొసైటీ మెంబర్ సెక్రటరీ ఆంజనేయులు, సంస్థ సభ్యులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ఓల్డేజ్ పింఛన్ పొందే వ్యక్తి మరణిస్తే భర్త లేదా భార్యకు పింఛన్ మంజూరు

### జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్



**ములుగు, మహా :** కుటుంబంలో భార్య లేదా భర్త ప్రస్తుతం వృద్ధాప్య పింఛన్ పొందుతూ మృతి చెందిన పక్షంలో భర్త చనిపోతే భార్యకు వృద్ధాప్య లేదా వితంతు పింఛను, భార్య చనిపోతే భర్తకు 57సంవత్సరాలు దాటినట్లయితే వృద్ధాప్య పింఛను వెంటనే మంజూరు చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జీవో 31ప్రకారం పింఛన్ మంజూరు చేయడం జరుగుతుందని వివరించారు. నూతన పెన్షన్ పొందాలంటే గ్రామ పంచాయతీ కార్యదర్శికి స్పౌజ్ ఆధార్ కార్డ్, బ్యాంకు పాస్ బుక్, మరణించిన వారి ధృవీకరణ పత్రాల ధృవీకరణ పత్రాలను అందించాలని సూచించారు. జిల్లాలో ఎవరైనా వృద్ధాప్య పెన్షన్ పొందుతూ మరణించిన పక్షంలో ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు. అదేవిధంగా గ్రామాలలో పలురకాల పింఛన్లను పొందుతున్న లబ్ధిదారుల వివరాలను, మృతి చెందిన వారి వివరాలను ఎప్పటికప్పుడు ప్రత్యేక రిజిస్టర్ లో నమోదు చేయాలని గ్రామ పంచాయతీ సెక్రటరీలను కలెక్టర్ ఆదేశించారు. మరణించిన వృద్ధాప్య పెన్షన్ దారుల భార్య లేదా భర్త వివరాలను మండల స్థాయిలో ఎంపీడీఓ ఎప్పటికప్పుడు నివేదిక సమర్పించాలని, పంచాయితీ సెక్రెటరీ ఇచ్చిన నివేదిక ప్రకారం కంప్యూటర్ ఆపరేటర్ లాగిన్ లో నమోదు చేసిన వివరాలను ఎంపీడీఓ పరిశీలించి ధృవీకరించాలన్నారు. అనంతరం జిల్లా స్థాయిలో పరిశీలించి వెంటనే పింఛన్ మంజూరు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు.



## సీసీ రోడ్డు పనులు ప్రారంభించిన గోరటి జ్యోతి నర్సింహా

**ఆమనగల్ మహా:** మున్సిపాలిటీ పరిధిలోని ఐదవ వార్డులో గురువారం స్థానిక మాజీ కౌన్సిలర్ గోరటి జ్యోతి నర్సింహా సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా గోరటి నర్సింహా మాట్లాడుతూ... సీసీ రోడ్డు నిర్మాణానికి 3 లక్షలు, నీటి పైప్ లైన్ కు 2 లక్షలు మొత్తం 5 లక్షలతో ఈ నిర్మాణ పనులను ప్రారంభిస్తున్నామని తెలిపారు. ఐదవ వార్డ్ కౌన్సిలర్ గా గెలిచిన నాటి నుండి వార్డులో ప్రజల సౌకర్యం కోసం కాలనీలో డ్రైనేజీలు, సీసీ రోడ్డు నిర్మాణ పనులు, మౌలిక సదుపాయాలు కల్పించి అభివృద్ధే ధ్యేయంగా పార్టీలకు అతీతంగా గతంలోనూ, ఇప్పుడు కూడా పని చేస్తున్నానని అన్నారు. నవ చైతన్య కాలనీలో ఎన్నో ఏళ్ళుగా అసంపూర్తిగా ఉన్నటువంటి రోడ్లను సీసీ రోడ్డుగా వేయించానని, ఐదవ వార్డు అభివృద్ధిలో ఎక్కడా రాజీ పడలేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు, మహిళలు పాల్గొన్నారు.

## దొంగతనాలు, ఆర్థికనేరాల్లో దర్యాప్తు ముమ్మరం చేయాలి

**ములుగు, మహా :** జిల్లాలోని పోలీస్ స్టేషన్ ల పరిధిలో నమోదవుతున్న కేసుల్లో దొంగతనాలు, ఆర్థిక నేరాలపై దర్యాప్తు ముమ్మరం చేయాలని, బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ డాక్టర్ పి.శబరీష్ ఆదేశించారు. గురువారం ములుగులోని జిల్లా పోలీసు కార్యాలయంలో నెలవారీ నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. మార్చి నెలలో నమోదైన కేసుల వివరాలను స్టేషన్ ల వారీగా తెలుసుకున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోగొట్టుకున్ననగదు, వస్తువులను రికవరీ చేసి బాధితులకు అప్పగించలేఆ కృషి చేయాలన్నారు. పాత కేసుల దర్యాప్తులో పురోగతిని పరిశీలించి, త్వరితగతిన దర్యాప్తు పూర్తి చేయాలని సూచించారు. ప్రస్తుత వేసవికాలంలో ప్రజలు సెలవులపై వెళ్లే సమయంలో దొంగతనాలు జరిగే ఆస్కారం ఎక్కువగా ఉన్నందున సురక్షితమైన చర్యలు తీసుకొనే విధంగా ప్రజలలో అవగాహన తీసుకురావాలన్నారు.

## సమయ పాలన తో
# నాకు అవసరం లేదు..!



- నా పని తీరు మారదు..!!
- తహశీల్దార్ ఉన్న కార్యాలయంలో సార్ దే పై చేయి
- సార్ పనితనం పై, పై అధికారుల పట్టింపు తెదంటున్నా ప్రజలు
- మంత్రి ఇలాకాలో ఇలాంటి అధికారులా....?

Episode...1

**మేళ్ళచెరువు, మహా:** సూర్యాపేట జిల్లా మేళ్ల చెరువు రెవిన్యూ శాఖలో అవినీతి చాపకింద నీరులా పాకిపోతుంది. మేళ్ళ చెరువు తాహాశ్ధీల్దార్ కార్యాలయంలో ఆర్ఐ గా పని చేస్తున్న మోసిన్ బాబా పని తీరు నేనే రాజు నేనే మంత్రి అన్నా రేంజ్ ఉందంటూన్నారు మండల ప్రజలు.సమయపాలన పాటించకపోవడంతో పాటు ప్రజల అవసరా సమస్యల్ని సోమ్ముగా చేసుకుంటూ పలువురి రాజకీయ పార్టీల నేతల అండదండలతో దండిగా డబ్బు దండుకుంటున్నాడన్నా ఆరోపణలు వినిపిస్తున్నాయి. మోసిన్ బాబా దగ్గరకు ఏమైనా సమస్యతో ప్రజలు వెళ్తే పైసా ఇవ్వందే ఫైల్ కదలదంటూన్నారు మండల ప్రజలు.ఇటివల కాలంలో స్థానిక మండల కేంద్రానికి చెందిన చిన్నపంగు పుల్లయ్య అనే వ్యక్తి రెవిన్యూ కార్యాలయానికి వెళ్తే పట్టపగలే చుక్కలు చూపించాడు అంటున్న బాధితుడు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రాజీవ్ యువ వికాసం పథకం అప్లై కోసం వెళ్లిన ప్రజల పట్ల దురుసుగా ప్రవర్తిస్తూ ప్రజలపై అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడంటూ ప్రజలు చెప్తున్నారు. ఒకవైపు ప్రజా ప్రభుత్వం అంటూ నాయకులు ప్రజాపాలన, స్పెషల్ అధికారుల పాలన అంటూ చెప్తున్నా అధికారులు ఆచరణలో కనిపిస్తా లేదంటూ ప్రజలు అనుకుంటున్నారు మంత్రి ఇలాకాలో ఇలాంటి అధికారులు ఉంటే మంత్రికి ప్రభుత్వానికి ప్రతిష్ట భంగం కలిగించే విధంగా ఉందంటున్నారు స్థానిక ప్రజలు. ఇలాంటి సమయపాలన పాటించని అధికారులపై ప్రజల పట్ల దురుసుగా ప్రవర్తించే లంచగొండి అధికారులపై ఉన్నతాధికారులు కొరడా జూలిపించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## ఎన్ ఆర్ ఈ జి ఎస్ నిధుల ద్వారా
# సీసీ రోడ్లు నిర్మాణం



**హుజూర్ నగర్, మహా :** సూర్యాపేట జిల్లా మేళ్లచెరువు మండలం రేవూరు గ్రామం సామినేని నాగేశ్వర రావు బజారులో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సహకారంతో, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు భాస్కర్ రెడ్డి,మాజీ ఎంపీపీ కొట్టే సైదే శ్వరరావు,శెట్టి రామ చంద్రరావు కృషితో ఎన్ఆర్ఈజీఎస్ నిధుల ద్వారా మంజూరు చేసిన సిసి రోడ్లను గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు శంకుస్థాపన చేయటం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రేవూరు గ్రామం అభివృద్ధి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో మాత్రమే జరుగుతుందని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో సాధం సత్యనారాయణ, వి సుధాకర్ రెడ్డి ,భూతం సత్యనారాయణ, భూతం మధు, మిత్తినేని రమేష్, స్వామినేని నరసింహారావు, భార్గవ్, గోవర్ధన్, సాదం కోటయ్య ,ధర్మారెడ్డి, తుమ్మల వెంకట్రావు,కొమ్ము కొండయ్య కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## రంజాన్ మాసం సందర్భంగా ముస్లిం కుటుంబాలకు
# రేషన్ కిట్టులను పంపిణీ చేసిన కొత్త జయపాల్ రెడ్డి






**కరీంనగర్, మహా:** పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని ఉపవాస దీక్షలు పాటిస్తున్న ముస్లీం కుటుంబాలకు మైత్రి గ్రూప్ చైర్మన్ కొత్త జయపాల్ రెడ్డి రేషన్ కిట్ లు పంపిణీ చేశారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని గోదాంగడ్డలో గల మసీద్ వద్ద చేపట్టిన ఈ పంపిణీ కార్యక్రమంలో సుమారుగా 200మంది ముస్లీం సోదరులకు జయపాలన్న మిత్రమండలి సభ్యులు రేషన్ కిట్ లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మైత్రి ఛానల్ ఎం.డి. సుజన్‌రావు మాట్లాడుతూ..కుల మతాలకు అతీతంగా మైత్రి గ్రూప్ చైర్మన్ కొత్త జయపాల్ రెడ్డి సామాజిక కార్యక్రమాలు చేపట్టడంలో ఎల్లప్పుడు ముందు ఉంటారని, అందులో భాగంగానే రూ. 20లక్షలతో 2వేలకు పైగా పేద ముస్లీం కుటుంబాలకు రేషన్ కిట్ లు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఈరోజు 200లకు పైగా ముస్లీంలకు పంపిణీ చేశామని, మరో నాలుగు రోజులు ఈ పంపిణీ కార్యక్రమం ఉంటుందని వారు తెలిపారు. ప్రతీ ఏడు పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని జయపాలన్న మిత్రమండలి ఆధ్వర్యంలో వివిధ రకాల సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు వారు తెలిపారు. ముస్లీం సోదరులు మాట్లాడుతూ... కరోనా లాంటి విపత్కర పరిస్థితుల్లోనూ కొత్త జయపాల్ రెడ్డి అనేక సామాజిక కార్యక్రమాలు చేపట్టారని, ప్రతీ ఏడు రంజాన్ పవిత్ర మాసాన్ని పురస్కరించుకొని ముస్లీంలకు నిత్యావసర సరుకులు అందజేయడంతో పాటు, పేద విద్యార్థుల చదువుకు ఆయనేంతో కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో జయపాలన్న మిత్రమండలి సభ్యులు ఎం.డి. అఖిల్అహ్మద్‌ఖాన్, ఖాలీద్ అక్బర్, అజ్మద్‌లాలా, ఖాలీద్‌సాబ్, మతిన్, ఆరిఫ్ తదితరులు పాల్గొన్నారు.



## ఆత్మీయ క్షేమాభివృద్ధి
# కూడిక

**హుజూర్ నగర్, మహా :** హుజూర్ నగర్ పట్టణంలోని వర్తక సంఘం భవనంలో గురువారం ఆత్మీయ క్షేమాభివృద్ధి కూడిక జరిగింది. ఈ కార్యక్రమం హుజూర్ నగర్ నియోజక వర్గ క్రిస్టియన్ పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షులు పాస్టర్ శామ్యూల్ గుండు అధ్యక్షతన జరిగింది.ఈ కార్యక్రమంలో ప్రముఖ క్రైస్తవ ప్రబోధకడు గ్రంథాల వక్త పాస్టర్ ప్రవీణ్ పగడాల రాజమండ్రి సమీపంలో అనుమానస్పదముగా మరణించిన వారి ఆత్మకు శాంతి కలగాలని మరియు వారి కుటుంబమునకు ఆదరణ కలగాలని హుజూర్ నగర్ క్రైస్తవ పాస్టర్లు ప్రార్థనలు చేశారు.ముఖ్య అతిథులుగా పాస్టర్ సిల్వి సిలోయం పాలుపొంది పాస్టర్ ప్రవీణ్ పగడాల ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థనలు చేసి ప్ల కార్డ్స్ తో నివాళులు అర్పించారు. ఈ సమావేశంలో హుజూర్ నగర్ నియోజక క్రైస్తవ పెద్దలు పాస్టర్ శామ్యూల్ గుండు,పాస్టర్ యెహోషాపాతు, పాస్టర్ శ్రీను నండిపాటి,పాస్టర్ జాన్ పాల్ రామినేని,పాస్టర్ జీవన్ కుమార్,పాస్టర్ ప్రసాద్ సంద్రపంగు, పాస్టర్ పాల్ రాజు,పాస్టర్ రూబెన్ సన్,అభిషేక్,ఇస్సాకు మరియు తదితర పాస్టర్లు విశ్వాసులు పాలుపొందినారు.

## పోలీసు భరోసా సెంటర్, షీ టీమ్స్ కార్యాలయాన్ని పరిశీలించిన జిల్లా ఎస్పీ నరసంహ

- మహిళల పట్ల, బాలల పట్ల వేదింపులకు పాల్పడితే శిక్షలు తప్పవు
- మహిళా, బాలల పట్ల వేధింపులపై ధైర్యంగా పిర్యాదు చేయాలి




కె.నరసింహ ఎస్పీ సూర్యాపేట జిల్లా

**హుజూర్ నగర్, మహా :** వేదింపులకు, దాడులకు గురైన వారికి బరోసా, ధైర్యం కల్పించాలని షీ టీమ్స్, భరోసా సెంటర్స్ ఆద్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని మహిళా, పిల్లల రక్షన చట్టాలు, శిక్షల గురించి వివరించాలని భరోసా సెంటర్, షీటీమ్స్ సిబ్బందిని జిల్లా ఎస్పీ నరసింహ ఆదేశించారు. గురువారం జిల్లా కేంద్రం లో జాతీయ రహదారి వెంట గల మహిళా భరోసా సెంటర్, షీ టీమ్స్ కార్యాలయాలను జిల్లా ఎస్పీ సందర్శించి కార్యలయం నంధు నిర్వహిస్తున్న రికార్డ్స్ ను పరిశీలించారు, సిబ్బంది నిర్వహిస్తున్న పనులులు, మహిళల, పిల్లల రక్షణ పట్ల తీసుకుంటున్న చర్యలు, కౌన్సిలింగ్ నిర్వహణ, అవగాహన కార్యక్రమాల నిర్వహణ ను పరిశీలించి సిబ్బందికి సలహాలు సూచనలు అందించారు. భరోసా సెంటర్ సిబ్బంది, షీ టీమ్స్ సిబ్బంది జిల్లాలో పని చేస్తున్న తీరును ఎస్పీ కి వివరించారు. దాడులకు, వేదింపులకు గురౌతున్న బాలల పట్ల, మహిళల పట్ల మానవతా దృక్పదం తో పని చేయాలి, వారికి సామాజిక అభద్రతా భావం ఏర్పడకుండా ధైర్యం కల్పించాలి, ఎప్పటికప్పుడు న్యాయ సహాయం అందించాలి, వైద్యం, మానసిక ధైర్యం కల్పించాలి అని ఎస్పీ అన్నారు. జిల్లా వ్యాప్తంగా విద్యాసంస్థల్లో, పట్టణాలు, కాలనీలలో భద్రత చట్టాల అమలు గురించి, పోలీసు శాఖ తీసుకుంటున్న చర్యల గురించి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి, రద్ధి ప్రాంతాల్లో ఆకతాయిల పై నిగా ఉంచాలి, విద్యాసంస్థల్లో కమిటీలు ఏర్పాటు చేయాలి ఎలాంటి సమస్య వచ్చిన, వేదింపులు జరిగిన సమాచారం వచ్చేలా నిఘా ఉంచాలి అని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ వేదింపులు, అత్యాచారం, నిరాదరణకు గురైన బాధిత మహిళలకు, పిల్లలకు ఒకే చోట న్యాయపరమైన, వైద్యం పరమైన సదుపాయాలు, సామాజిక భద్రత, నైతిక భద్రత, మానసిక ధైర్యం, అవసరమైన వారికి చదువు ఇలా అన్ని సౌకర్యాలు ఒకే చోట కల్పిస్తూ, బాధితులకు మనోధైర్యం కల్పించే విధంగా రాష్ట్ర పోలీసు మహిళ అండ్ చైల్డ్ వెల్ఫేర్ అధ్వర్యంలో జిల్లా బరోసా సెంటర్ ను ఏర్పాటు చేయడం జరిగినదని జిల్లా ఎస్పీ అన్నారు. బరోసా సెంటర్, షీ టీమ్స్ యొక్క విధి విధానాలు, లక్ష్యాలు, ఉద్దేశం, లైంగిక దాడులకు గురైన మహిళల, బాలల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సంరక్షణ చర్యలు, కల్పించాల్సిన భద్రత మొదలగు అంశాలపై, కళాశాలల్లో విద్యార్థులకు, సమాజంలో మహిళల భద్రత, రక్షణ చట్టలపై నిర్వహించాల్సిన అవగాహన కార్యక్రమాలు గురించి బారోసా సెంటర్, షీ టీమ్స్ సిబ్బందికి వివరించారు. వేదింపులపై ధైర్యంగా పిర్యాధు చేయాలని కోరారు. మహిళల, బాలల రక్షణలో చట్టాలు బలోపేతం చేయబడ్డాయి, ఎవరైనా వేదింపులు, లైంగిక దాడులకు పాల్పడితే జైలు శిక్షలు తప్పవు అని ఎస్పీ హెచ్చరించారు. పిల్లలపై లైంగిక దాడులు పోక్సో చట్టం కేసుల్లో జీవితకాలం శిక్షలు పడుతున్నాయి అన్నారు. సాంకేతికత ఆధారాలతో నాణ్యమైన దర్యాప్తును చేస్తున్నాము, ఫాస్ట్ ట్రాక్ లో మాదిరిగా నేరాల్లో త్వరగా శిక్షలు అమలైయ్యేలా పోలీసు శాఖ పని చేస్తున్నది అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ వెంట బారోసా సెంటర్ ఎస్సై మౌనిక, షీ టీమ్స్ ఎస్సై నీలిమ, ఏఎస్ఐ లు సైదాభి, సాలయ్య, బారోసా సెంటర్, షీటీమ్స్ సిబ్బంది ఉన్నారు.

## లక్ష్మీ నరసింహ స్వామి
# హుండీ లెక్కింపు



**హుజూర్ నగర్, మహా :** శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారి దేవస్థానం, మట్టపల్లి మహాక్షేత్రములో గురువారం ఉదయం గం1000లకు హుండీ లెక్కింపు కార్యక్రమము జరిగింది. ఇట్టి హుండీ లెక్కింపునకు దేవాదాయశాఖ నుండి పర్యవేక్షణ నిమిత్తం కె.భాస్కర్, సహాయ కమీషనర్, మరియు దేవస్థాన అనువంశిక ధర్మకర్త చెన్నూరు విజయ్ కుమార్,మట్టపల్లిరావు, కార్యనిర్వహణాధికారి సిరికొండ నవీన్, టి.వి.చలపతి, ఈ.ఓ, వారల సమక్షములో హుండీ లెంక్కింపు జరిగింది తేదీ14.02.2025 నుండి 26.03.2025 వరకు 41 రోజులు రెగ్యులర్ హుండి రు.6,04,125 అన్నదానం రూ.30,370 మొత్తం కలిపి రూ.6,34,495లు వచ్చినవి. ఇట్టి హుండీ లెక్కింపులో శ్రీసాయి సేవా సంఘం వారు 40. మంది మరియు దేవస్థాన అర్చకులు, సిబ్బంది, భక్తులు లెక్కించారు.

## డ్రగ్స్ రహిత ములుగు జిల్లా కోసం పాటుపడుతాం





- జిల్లా ఎస్పీ డాక్టర్ పి.శబరీష్
- ఎన్డీపీఎస్ చట్టంపై పోలీసు అధికారులకు అవగాహన సదస్సు

**ములుగు, మహా :** జీవితాలను నాశనం చేస్తున్న డ్రగ్స్ రహిత ములుగు జిల్లా కోసం కలిసికట్టుగా కృషి చేద్దామని, అందుకు అవసరమైన శిక్షణ ద్వారా అవగాహన పెంచుకోవాలని జిల్లా ఎస్పీ డాక్టర్ పి.శబరీష్ పిలుపునిచ్చారు. గురువారం ములుగులోని జిల్లా పోలీసు కార్యాలయంలో నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రోపిక్ సబ్స్టాన్సెస్ (ఎన్డీపీఎస్) చట్టంపై పోలీసు అధికారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. నార్కోటిక్ విభాగం డీఎస్పీ నరసింగరావు నార్కోటిక్ చట్టంపై అవగాహన కల్పించారు. అనుసరించాల్సిన నియమనిబంధనలు, ఈ సాక్ష్య అప్లికేషన్, విచారణలో దాని ఉపయోగం, తదితర అంశాలపై పూర్తిస్థాయిలో వివరించారు. పలువురు అధికారులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు.ఈ సందర్భంగా ఎస్పీ శబరీష్ మాట్లాడుతూ.. నార్కోటిక్ చట్టంపై అవగాహన కల్పించేందుకు గాను ఆవిభాగం తెలంగాణ డైరెక్టర్ సందీప్ శాండిల్య స్పందించడం సంతోషకరమన్నారు. ఎన్డీపీఎస్ కేసుల విచారణలో నియమనిబంధనల ప్రకారమే నడుచుకోవాలని, కేసులలో నేరస్థులకు శిక్షపడేవిధంగా కృషి చేయాలని అధికారులకు పిలుపునిచ్చారు. జిల్లాను డ్రగ్స్ రహిత జిల్లాగా మార్చాలని కోరారు. ముఖ్యంగా యువత డ్రగ్స్ జోలికి పోవద్దని, జీవితాలను నాశనం చేసుకోవద్దని, చదువుల్లో రాణించి భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏటూరునాగారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయ, ములుగు డీఎస్పీ రవీందర్, డీసీఆర్బీ డిఎస్పీ కిషోర్ కుమార్, ఎస్బి ఇన్స్పెక్టర్ రమేశ్, సిఐలు శ్రీనివాస్, శంకర్, బి.కుమార్, జి.రవీందర్, ఎస్ఐలు వెంకటేశ్వరరావు, సతీష్, కమలాకర్, శ్రీకాంత్ రెడ్డి, తాజుద్దీన్, టీవీఆర్ సూరి, రాజ్ కుమార్, కృష్ణ ప్రసాద్, తిరుపతి, వెంకటేష్, డిసిఆర్బి ఎస్సై జగదీష్, సిబ్బంది పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ పార్టీ ఇన్సూరెన్స్
# చెక్కును అందజేసిన
### మాజీ ఎమ్మెల్యే డా.గాదరి కిశోర్ కుమార్



**మోత్కూర్, మహా:** యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డగూడూరు మండలం లక్ష్మిదేవికాలువ గ్రామానికి చెందిన పాశ్రేపాటి వెంకటేష్‌గారు గత కొన్ని రోజుల క్రితం ప్రమాదవశాత్తు మరణించారు వారికి భారత రాష్ట్ర సమితి పార్టీ యొక్క క్రియాశీలక సభ్యత్వం పొందినటువంటి కార్యకర్త కావడంతో వెంటనే స్పందించిన తుంగతుర్తి మాజీ శాసనసభ్యులు, డా.గాదరి కిశోర్ కుమార్,కి సంబంధించిన ఎఫ్ఐఆర్ కాపీలు మరియు పోస్టుమార్టం రిపోర్టులను భారత రాష్ట్ర సమితి పార్టీ ఇన్సూరెన్స్ విభాగానికి పంపడం జరిగింది. వారికి మంజూరైన భారత రాష్ట్ర సమితి పార్టీ ఇన్సూరెన్స్ చెక్కును, వారి కుటుంబ సభ్యులకు రూ 2,00,000/రెండు లక్షల రూపాయల చెక్కును, అందజేశారు.

## రైతుల అభివృద్ధికి
# సహకార సంఘం సహాయం




**రంగారెడ్డి జిల్లా, మహా:** ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఉప్పరిగూడ సర్వసభ సమావేశం చైర్మన్ ఏదుల పాండురంగారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఇబ్రహీంపట్నం శేరిగూడలో నిర్వహించిన ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఐసిఎం డైరెక్టర్ డాక్టర్ ఆర్ గణేష్, మాజీ డిప్యూటీ రిజిస్ట్రర్ నరేందర్ రెడ్డి హాజరయ్యారు. కోఆపరేటివ్ బ్యాంక్ ఉప్పరిగూడలో 3500 ఓటింగ్ రైతులు ఉన్నారు. రంగారెడ్డి జిల్లాలో ఉప్పరిగూడ కోఆపరేటివ్ బ్యాంక్ అభివృద్ధి చెందుతూ ముందువరుసలో ఉందన్నారు. ఈ సమావేశంలో రైతులకు బ్యాంకులో ఇచ్చిన రుణాలపై, బ్యాంకు అభివృద్ధిపై చర్చించడం జరిగింది. అనంతరం బ్యాంకు అభివృద్ధికి ఖాతాదారులు, రైతులు సహకరిస్తున్నట్లు, రైతులు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లిస్తున్నారని తెలిపారు. రైతు రుణమాఫీ... ఉప్పరిగూడ కోఆపరేటివ్ బ్యాంకులో ఒక వెయ్యి 60 మంది రైతులు రెండు లక్షల రూపాయల వరకు రుణం పొందారు. ఇప్పటివరకు 723 మందికి రుణాలు మాఫీ కాగా, 337 మంది రైతులకు రుణమాఫీ కాలేదన్నారు. రుణమాఫీ కానీ రైతులు సభలో ఆవేదన వ్యక్తం చేశారు. పిఎసిఎస్ చైర్మన్ పాండురంగారెడ్డి మాట్లాడుతూ... బ్యాంకులో రుణం పొందిన ప్రతి ఒక్క రైతుకు అతి త్వరలో, రుణాలు మాఫీ చేయడానికి ప్రయత్నం చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. టి సొసైటీని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు తన వంతు కృషి చేస్తానని అన్నారు. ఈ సమావేశంలో సీఈఓ బోసుపల్లి గణేష్, బ్యాంకు వైస్ చైర్మన్ రాజశేఖర్ రెడ్డి, బ్యాంకు డైరెక్టర్లు రైతులు మొద్దు అంజిరెడ్డి, అల్వాల వెంకటరెడ్డి, కొండాల శంకర్ గౌడ్, రైతులు, మహిళా రైతులు, బ్యాంకు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రాజీవ్ యువ వికాసం పథకాన్ని
# సద్వినియోగం చేసుకోవాలి



**మోత్కూర్, మహా:** యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మున్సిపల్ కేంద్రంలో ఎన్ఎస్యుఐ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు అన్నారు. తెలంగాణ యువత కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పేరుతో కొత్త పథకాన్ని ప్రారంభించారని, ఎన్ఎస్యుఐ మండల అధ్యక్షులు, నిమ్మల శ్రీనివాస్ యాదవ్ అన్నారు. రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రూ. 6 వేల కోట్లతో ప్రారంభించి రాష్ట్రంలోని అర్హులైన యువకులకు 50 వేల నుండి 4లక్షల ఆర్థిక సాయం చేస్తుందన్నారు. ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ ,బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన యువత ఈ పథకం కోసం దరఖాస్తు చేసుకోవచ్చని అన్నారు. మార్చి 17వ తేదీ నుంచి ఏప్రిల్ 5వ తేదీ వరకు ఇంటర్నెట్ ద్వారా దరఖాస్తులు స్వీకరించనున్నారని వివరించారు. ఈ పథకాన్ని బట్టి 60 నుంచి 80 శాతం వరకు ప్రభుత్వమే సబ్సిడీ వస్తుంది. ఈ పథకం ద్వారా తెలంగాణ వ్యాప్తంగా ఉన్న ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనారిటీ వర్గాలకు చెందిన 5 లక్షల మంది నిరుద్యోగులు లబ్ది పొందనున్నారని ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎరసానిపల్లి సందీప్. మండల ప్రధాన కార్యదర్శి బుశిపాక రమేష్, నాయకులు నిమ్మల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## చిన్నకాలేశ్వరం కాలువ కోసం
# భూసేకరణ



**కాటారం , మహా :** చిన్న కాలేశ్వరం పథకంలో భాగంగా కాటారం మండలంలోని ధన్వాడ గ్రామంలో కాలువ నిర్మాణం కోసం గురువారం భూసేకరణ పనులు నిర్వహించారు. మండలంలోని గుమ్మాలపల్లి గ్రామం నుండి ధన్వాడ గ్రామం మీదుగా దేవరంపల్లి వరకు ఐదు కి మీ ఢీ 2 కాలువ నిర్మాణం కోసం సర్వే నిర్వహిస్తున్నారు. సుమారు 30 మంది రైతులు 150 ఎకరాల భూమిని కోల్పోతున్నారు. అలైన్మెంట్ కాలువ కోసం సర్వే చేస్తూ అధికారులు హద్దులు పెడుతున్నారు. డిప్యూటీ ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ రాములు, కాటారం సబ్ ఇన్స్పెక్టర్ 2 శ్రీనివాస్, ప్రొఫెషనరీ ఎస్ఐ గీత, పోలీస్ సిబ్బంది నీటిపారుదల శాఖ ఏఈ వెంకటేష్, సర్వేయర్ నిరంజన్, మెగా కంపెనీ సర్వే అసిస్టెంట్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

## అంతర్జాతీయ ప్రమాణాలతో మార్కెట్ ను తీర్చిదిద్దాలి

- త్వరలో కోహెడ నూతన మార్కెట్ కు ముఖ్యమంత్రి
- మార్కెట్ నిర్మాణ పనులు సమీక్షించనున్నారు
- ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి



**రంగారెడ్డి జిల్లా, మహా:** తెలంగాణ అసెంబ్లీ లో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిపి నియోజకవర్గ అభివృద్ధి కొరకై ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి, ఏఎంసీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి చర్చించడం జరిగిందన్నారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిని గురువారం సాయంత్రం అసెంబ్లీలోని సిఎం ఛాంబర్ లో ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డితో కలిసి కోహెడలో ఏర్పాటు చేయబోయే నూతన మార్కెట్ పై చర్చించిన గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, వెంటనే స్పందిస్తూ సంబంధిత ఉన్నత అధికారులను ఆదేశిస్తూ కోహెడ మార్కెట్ కి సంబంధించిన పరిపాలన అనుమతులు వేగవంతం చేయాలని, త్వరలో ఇట్టి ప్రాజెక్ట్ పైన సమీక్ష సమావేశం ఏర్పాటు చేయాలని అధికారులను సూచించారు. కోహెడలో ఏర్పాటు చేయబోయే సమీకృత మార్కెట్ దేశంలోనే ఆదర్శంగా ఉండేలా చూడాలని అన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మాణ పనులు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనర్ రఘునందన్ రావు, సిఎం ఓఎస్డీ చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ ను నిషేదిద్దాం
# పర్యావరణాన్ని కాపాడుకుందాం
### సీఎం చేత ప్లాస్టిక్ వినియోగం - ప్రమాద ఘంటికలు పుస్తక ఆవిష్కరణ





**వరంగల్, మహా:** తెలంగాణ ప్రజలు ఎవ్వరూ ప్లాస్టిక్ వాడొద్దని పర్యావరణాన్ని నష్టపరచొద్దని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పిలుపునిచ్చారు. గురువారం శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చేతుల మీదుగా ప్లాస్టిక్ వినియోగం ప్రమాద ఘంటికలు పుస్తకాన్ని ఆవిష్కరించారు. మంత్రి కొండా సురేఖ పర్యావరణ పరిరక్షణకు సే నో టూ ప్లాస్టిక్ నినాదాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్ళాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ శాసనసభ సభ్యులు, శాసనమండలి సభ్యులకు జూట్ బ్యాగు, పుస్తకం, కాపర్ బాటిల్, స్టీల్ టిఫిన్ బాక్సు, బట్ట సంచులను మంత్రి కొండా సురేఖ అందజేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి కొండా సురేఖతో పాటు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు(పీసీబీ) మెంబర్ సెక్రటరీ గుగులోత్ రవి ఉన్నారు. ఈ సందర్భంగా సురేఖ మాట్లాడుతూ... ప్రతి సంవత్సరం 5,00,000,00,00,000 (5 లక్షల కోట్లు) కంటే ఎక్కువ ప్లాస్టిక్ సంచులు వాడి పారేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి నిమిషం 10,00,000 (10 లక్షలు) వాటర్ బాటిళ్లు కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. ఇప్పటివరకు ప్రపంచవ్యాప్తంగా ఉత్పత్తయిన మొత్తం ప్లాస్టిక్ వ్యర్థాలు 630 కోట్ల టన్నులు అని వివరించారు. వీటిలో 79% ప్లాస్టిక్ వ్యర్థాలను సముద్రాలు, నీటి వనరులలో పారేస్తున్నారన్నారు. మిగిలిన 12% ప్లాస్టిక్ వ్యర్థాలు భూమిపై వదిలేస్తున్నారని చెప్పారు. 9% మాత్రమే రీసైకిల్ చేయబడుతున్నాయన్నారు. ఈ ప్లాస్టిక్ వ్యర్థాలు కాల్వలు, సరస్సులు, నదీ ప్రవాహాలను అడ్డుకుంటున్నాయన్నారు. మొక్కలు, వృక్షాలు, జంతు జలాన్ని పర్యావరణాన్ని నాశనం చేస్తున్నాయన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలను కాల్చడం వల్ల కాన్సర్ కారక విషపూరిత వాయులు వెలువడుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. మైక్రో ప్లాస్టిక్ లు జంతువులు, మానవ శరీరాల్లోకి చొరబడతాయని, అందుచేత, ఎస్యూపీ వద్దు... సే నో టూ ఎస్యూపీ నినాదంతో ముందుకు వెళ్ళాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ నిత్యజీవితంలో ఎస్యూపీ వినియోగం పూర్తిగా నివారించి బయో డిగ్రెడబుల్ వస్తువులను వాడాలని కోరారు. ప్లాస్టిక్ కవర్లు, నాన్ ఓవెన్ క్యారీ బ్యాగులు లాంటివి నివారించి జూట్, బట్ట సంచులను వాడాలని సూచించారు. జూట్ బ్యాగ్, బట్ట సంచులు.., అలాగే ప్లాస్టిక్ బ్లాటిల్స్ వినియోగాన్ని నివారించి దానికి బదులుగా గ్లాస్ బాటిల్స్, స్టీల్ బాటిల్స్ ఉపయోగించాలని, వీరందరి సురేఖ కాపర్ బాటిల్ నేతలందరికీ అందజేశారు. ప్లాస్టిక్ బాక్సులలో ఆహారాన్ని వినియోగించొద్దని తెలియజేస్తూ స్టీల్ టిఫిన్ బాక్సును అందజేశారు.



# వాళ్లకు మాత్రం ఏఐ ముప్పు ఉండదు.. బిల్ గేట్స్



ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI) పరిశ్రమలను వేగంగా మార్చివేసింది. ముఖ్యంగా 2022లో చాట్‌జీపీటీ వచ్చినప్పటి నుంచి దీని విస్తృతి మరింతగా పెరిగింది. చాలా మంది తమ రోజువారీ జీవితంలో, వృత్తుల్లో జెమినీ, కోపైలట్, డీప్‌సీక్ వంటి చాట్‌బాట్‌లను వినియోగిస్తున్నారు. దీని ప్రయోజనాలు ఎలా ఉన్నా సరే.. మానవ ఉద్యోగాలను ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ లాగేసుకుంటుందన్న ఆందోళనలు మాత్రం ఉద్యోగులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఈ సరికొత్త సాంకేతిక విప్లవం నడుమ మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్.. కనీసం కొన్ని రోజులైనా కృత్రిమ మేధ ఆధారిత ఆటోమేషన్ నుండి సురక్షితంగా ఉండటానికి అవకాశం ఉన్న వృత్తులపై తన భావాలను పంచుకున్నారు. ఇటీవలి ఇంటర్వ్యూలో గేట్స్ ప్రత్యేకమైన మానవ నైపుణ్యాలు అవసరమయ్యే మూడు కీలక రంగాలను హైలైట్ చేశారు. అవి కోడింగ్, ఎనర్జీ మేనేజ్‌మెంట్, బయాలజీ.

**కోడర్లు.. వీళ్లే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆర్కిటెక్ట్స్**

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వ్యవస్థలను అభివృద్ధి చేయడానికి బాధ్యత వహించే నిపుణులు తమ ఉద్యోగాలను నిలుపుకునే అవకాశం ఉంది. ఏఐ కోడ్ జనరేట్ చేయడం, కొన్ని ప్రోగ్రామింగ్ పనులను ఆటోమేట్ చేయడంలో పురోగతి సాధించినప్పటికీ, సంక్లిష్టమైన సాఫ్ట్‌వేర్‌ను అభివృద్ధి చేయడానికి అవసరమైన ఖచ్చితత్వం, లాజిక్, సమస్య పరిష్కార నైపుణ్యాలు దీనికి లేవు. డీబగ్గింగ్ చేయడానికి, రిఫైనింగ్ చేయడానికి, మరోపక్క ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను మెరుగుపరచడానికి కూడా హ్యూమన్ ప్రోగ్రామర్లు అనివార్యమని గేట్స్ అభిప్రాయపడ్డారు.

**ఎనర్జీ ఎక్స్‌పర్ట్స్**

శిలాజ ఇంధనాలు, అణుశక్తి, పునరుత్పాదక ఇంధన వనరులతో కూడిన ప్రపంచ ఇంధన రంగం అత్యంత సంక్లిష్టమైనది. కృత్రిమ మేధస్సు.. సామర్థ్యాన్ని మెరుగుపరచడం, డిమాండ్‌ను అంచనా వేయడం, మౌలిక సదుపాయాలను నిర్వహించడంలో సహాయపడుతుంది. అయితే ఇది ఇంధన పరిశ్రమను నిర్వచించే సంక్లిష్టమైన నియంత్రణ భూభాగాలు, భౌగోళిక రాజకీయ సవాళ్లు, అనూహ్య మార్కెట్ హెచ్చుతగ్గులను స్వతంత్రంగా నిర్వహించలేదు. వ్యూహాత్మక నిర్ణయాలు తీసుకోవడంలో, సుస్థిర పరిష్కారాలను అమలు చేయడంలో, విద్యుత్ అంతరాయాలు లేదా వనరుల కొరత వంటి సంక్షోభాలకు ప్రతిస్పందించడంలో మానవ నైపుణ్యం కీలకమని గేట్స్ నొక్కి చెప్పారు.

**జీవశాస్త్రవేత్తలు**

జీవశాస్త్రంలో.. ముఖ్యంగా వైద్య పరిశోధన, శాస్త్రీయ ఆవిష్కరణలో మానవ అంతర్దృష్టి, సృజనాత్మకత, విమర్శనాత్మక ఆలోచన అవసరం. కృత్రిమ మేధ పెద్ద మొత్తంలో డేటాను ప్రాసెస్ చేయడంలో, నమూనాలను గుర్తించడంలో రాణిస్తున్నప్పటికీ, ఇది అద్భుతమైన పరికల్పనలను రూపొందించే లేదా పరిశోధనలో సహజమైన పురోగతిని సాధించే సామర్థ్యాన్ని కలిగి ఉండదు. వ్యాధుల నిర్ధారణకు, జన్యుక్రమాలను విశ్లేషించడానికి, ఔషధ ఆవిష్కరణకు మాత్రం ఏఐ సహాయపడుతుందని గేట్స్ పేర్కొన్నారు.


# లాభాల్లో స్టాక్ మార్కెట్లు

## ఆటో షేర్లపై ట్రంప్ దెబ్బ

ఇండియన్ బెంచ్ మార్క్ ఈక్విటీ సూచీలు గురువారం లాభాల్లో ముగిశాయి. 30 షేర్ల సెన్సెక్స్ 317.93 పాయింట్లు (0.41 శాతం) పెరిగి 77,606.43 వద్ద స్థిరపడింది. ఈ రోజు సూచీ 77,747.4677,082.51 రేంజ్‌లో ట్రేడ్ అయింది. అలాగే నిఫ్టీ 50 సూచీ 105.10 పాయింట్లు (0.45 శాతం) లాభంతో 23,591.95 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 50 ఇంట్రాడేలో 23,646.45 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని నమోదు చేయగా, ఇంట్రాడే కనిష్ఠాన్ని 23,412.20 వద్ద నమోదు చేసింది. బజాజ్ ఫిన్‌సర్వ్, ఎన్టీపీసీ, ఇండస్‌ఇండ్ బ్యాంక్, లార్సెన్ అండ్ టూబ్రో, బజాజ్ ఫైనాన్స్ షేర్లు 2.85 శాతం వరకు లాభాలతో టాప్ గెయినర్స్‌గా నిలిచాయి. అదే సమయంలో టాటా మోటార్స్, సన్ ఫార్మా, హిందుస్థాన్ యూనిలీవర్, కోటక్ మహీంద్రా బ్యాంక్, భారతీ ఎయిర్‌టెల్ షేర్లు 5.38 శాతం వరకు నష్టపోయాయి. నిఫ్టీ స్మాల్ క్యాప్ 100 ఇండెక్స్ 1.15 శాతం లాభపడటంతో స్మాల్ క్యాప్ షేర్లు లాభాల్లో ముగిశాయి. నిఫ్టీ మిడ్ క్యాప్ 100 ఇండెక్స్ కూడా 0.37 శాతం లాభంతో స్థిరపడింది. నిఫ్టీ ఆటో, ఫార్మా మినహా మిగిలిన అన్ని రంగాల సూచీలు గురువారం లాభాల్లో ముగిశాయి. అమెరికాలో తయారు చేయని అన్ని దిగుమతి కార్లపై 25 శాతం సుంకం విధిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించడంతో ఆటో షేర్లు అమ్మకాలను చవిచూశాయి. నిఫ్టీ ఆటో ఇండెక్స్ గురువారం 1.04 శాతం నష్టంతో స్థిరపడింది. బ్యాంక్ ఆఫ్ బరోడా, పంజాబ్ నేషనల్ బ్యాంక్ నేతృత్వంలోని నిఫ్టీ పీఎస్‌యూ బ్యాంక్ ఇండెక్స్ 2.50 శాతం లాభంతో స్థిరపడింది.

# అమెరికా ఎంబసీ షాక్

## భారత్‌లో 2 వేల వీసా దరఖాస్తులు రద్దు




భారత్‌లోని యూఎస్ ఎంబసీ ఇటీవల వేల సంఖ్యలో వీసా దరఖాస్తులను రద్దు చేసింది. మోసపూరిత కార్యకలాపాలను నిరోధించే చర్యల్లో సుమారు 2,000 వీసా అపాయింట్‌మెంట్లను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. రెండు నెలల క్రితం డొనాల్డ్ ట్రంప్ అధ్యక్షుడుగా బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి అమెరికా కొత్త ప్రభుత్వం కఠినమైన ఇమ్మిగ్రేషన్, వీసా విధానాన్ని చేపట్టింది.

**కారణం ఇదే..**

వీసా అపాయింట్‌మెంట్ల షెడ్యూలింగ్‌లో అవకతవకలపై యూస్ ఎంబసీ దృష్టి పెట్టింది. అందులో భాగంగా "బ్యాడ్ యాక్టర్స్" (అక్రమార్కులు) లేదా బాట్స్ (మెషీన్లు) ద్వారా అపాయింట్మెంట్ సిస్టమ్‌లో జరుగుతున్న ఉల్లంఘనల గుర్తించిన రాయబార కార్యాలయం ఆయా ఖాతాలను సస్పెండ్ చేసింది. ఇలా చేసిన సుమారు 2,000 వీసా అపాయింట్మెంట్లను రద్దు చేసింది. తమ షెడ్యూలింగ్ విధానాలను ఉల్లంఘించే ఏజెంట్లు, ఫిక్సర్ల పట్ల కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరిస్తామని అమెరికా రాయబార కార్యాలయం ఎక్స్ లో పోస్ట్ చేసింది. తక్షణమే ఈ నియామకాలను రద్దు చేస్తున్నామని, అనుబంధ ఖాతాల షెడ్యూలింగ్ అధికారాలను నిలిపివేస్తున్నామని పేర్కొంది.


**భారతీయులే ఎక్కువ**

విద్య, ఉద్యోగం, పర్యాటకం.. ఇలా వివిధ పనుల కోసం యునైటెడ్ స్టేట్స్ లోకి ప్రవేశించే అతి ఎక్కువ మందిలో భారతీయులు ప్రముఖంగా ఉంటున్నారు. భారత్ లో అమెరికా వీసా దరఖాస్తులు గణనీయంగా బ్యాక్ లాగ్ లను ఎదుర్కొంటున్నాయి. ముఖ్యంగా బీ1, బీ2 దరఖాస్తుదారుల్లో జాప్యం ఎక్కువ ఉంటోంది. ఈ వీసాలు వ్యాపారం, పర్యాటకం కోసం ఉద్దేశించినవి. 202223లో దరఖాస్తు చేసుకున్నవారు 800 నుంచి 1000 రోజుల వరకు వేచి ఉండాల్సి వచ్చింది. ఇలాంటి సుదీర్ఘ నిరీక్షణ సమయాన్ని ఎదుర్కోవడానికి, జర్మనీలోని ఫ్రాంక్ఫర్ట్, థాయ్ రాజధాని బ్యాంకాక్‌లో భారతీయ దరఖాస్తుదారులకు అమెరికా వీసా అపాయింట్‌మెంట్లను తెరిచింది. వీసా వెయిటింగ్ టైమ్ గురించి భారత ప్రభుత్వం ఎప్పకప్పుడు ఆందోళన వ్యక్తం చేస్తూ వస్తోంది. 2022లో అప్పటి అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్‌తో వీసా జాప్యంపై భారత విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ ఆందోళన వ్యక్తం చేశారు. కోవిడ్19 మహమ్మారి కారణంగానే ఈ పరిస్థితి తలెత్తిందని అప్పటి బైడెన్ ప్రభుత్వం పేర్కొంది. డొనాల్డ్ ట్రంప్ ప్రమాణ స్వీకారానికి ఇటీవల జనవరిలో వాషింగ్టన్ వెళ్లిన జైశంకర్ కొత్త విదేశాంగ మంత్రి మార్కో రూబియోతో మరోసారి ఈ అంశాన్ని లేవనెత్తారు.



## దేశం-విదేశం NATIONAL-INTERNATIONAL





# పన్నీర్‌లో ప్రమాదకర బాక్టీరియా

## నివేదికల్లో వెల్లడి

**దొడ్డబళ్లాపురం:** బెంగళూరులోను, రాష్ట్రంలో ఆహార తనిఖీలలో రోజుకొక ఆహారం బండారం బయటపడుతోంది. ఇప్పటివరకు బొంబై మిఠాయి, టమాటా సాస్, బేకరీలలో కేక్‌లు, పానీ పూరి, గోబీ, ఇడ్లీ, కళింగర పండ్లు తదితరాలలో కల్తీలు, కాలుష్య కారకాలు ఉన్నాయని ఆహార భద్రతా శాఖ ప్రకటించడం తెలిసిందే. ఇప్పుడు పన్నీర్ వంతు వచ్చింది. స్టార్ హోటళ్ల నుంచి తోపుడు బండ్ల వరకు పన్నీర్ వంటకాలు ప్రాచుర్యంలో ఉన్నాయి. కానీ ఆ పన్నీర్ ఎంత శుభ్రమైనది అనేది ఎవరూ పట్టించుకోవడం లేదు. మసాలాలు వేసి వండి వడ్డిస్తే ఆబగా తినేయడం కనిపిస్తుంది. ఆహారశాఖ అధికారులు బెంగళూరులో పలు చోట్ల పన్నీర్ శాంపిల్స్‌ను సేకరించి నాణ్యత పరీక్షకు పంపించారు. రిపోర్టుల్లో పన్నీర్‌లో ప్రమాదకర బాక్టీరియా ఉన్నట్టు పేర్కొన్నారు. 231 పన్నీర్ శాంపిల్స్‌లో 17 శాంపిల్స్ రిపోర్టు మాత్రం వచ్చింది. వాటిలో ప్రమాదకర బాక్టీరియా ఉన్నట్టు, దానివల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని పేర్కొన్నారు. కల్తీ పదార్థాలతో పన్నీర్ తయారీ, అపరిశుభ్ర పరిస్థితుల్లో నిల్వ, దానిని వట్టి చేతులతో తాకడం వల్ల కలుషితం అవుతుంది.





# రూ. 4 కోట్లా? ప్రభుత్వ ఉద్యోగమా?.. స్థలమా?.. ఏది కావాలి?

ప్యారిస్ ఒలింపిక్స్2024 (Paris Olympics)లో సత్తా చాటిన భారత రెజ్లర్, ప్రస్తుత కాంగ్రెస్ ఎమ్మెల్యే వినేశ్ ఫొగట్ (Vinesh Phogat)కు.. హర్యానా ప్రభుత్వం మూడు ఆప్షన్లు ఇచ్చింది. ''రూ. 4 కోట్లా? ప్రభుత్వ ఉద్యోగమా?.. లేదంటే ప్లాట్''.. వీటిలో ఆమెకు ఏదీ కావాలో చెప్పాలని కోరింది. కాగా వినేశ్ ఫొగట్ తృటిలో ఒలింపిక్ పతకాన్ని చేజార్చుకున్న విషయం తెలిసిందే. మహిళల యాభై కిలోల కుస్తీ విభాగంలో అద్భుత ప్రదర్శనలతో ఫైనల్‌కు చేరిన వినేశ్.. ఈ ఘనత సాధించిన తొలి భారత మహిళా రెజ్లర్‌గా చరిత్ర సృష్టించారు. అయితే, అనూహ్య రీతిలో టైటిల్ పోరుకు ముందు.. పోటీలో పాల్గొనకుండా ఆమెపై వేటు పడింది. నిర్ణీత బరువు కంటే వంద గ్రాములు ఎక్కువగా ఉన్న కారణంగా పతకం కోసం పోటీ పడే అవకాశం చేజారింది.

**కనీసం రజతమైనా ఇవ్వాలని అప్పీలు**

ఆ తర్వాత స్పోర్ట్స్ కోర్టులో కనీసం రజతమైనా ఇవ్వాలని అప్పీలు చేసినా ఫలితం లేకుండా పోయింది. ఒక్క గ్రాము బరువు ఎక్కువగా ఉన్నా పోటీకి, పతకానికి అనర్హులే అంటూ కోర్టు వినేశ్ ఫొగట్ పిటిషన్‌ను కొట్టి వేయడంతో ఆమెతో పాటు యావత్ భారతావనికి నిరాశే మిగిలింది. అయితే, ఫైనల్ వరకు వినేశ్ చేరిన తీరును ప్రశంసిస్తూ అభినందలు వెల్లువెత్తాయి. ఓడినా మనసులు గెలిచిందంటూ ఆమెపై ప్రశంసల జల్లు కురిసింది. నాడు.. ప్రస్తుత హర్యానా ముఖ్యమంత్రి నయాబ్ సింగ్ సైనీ సైతం.. ''హర్యానాకు గర్వకారణమైన ఫొగట్ గౌరవాన్ని మేము మరింత పెంచుతాం'' అని ట్వీట్ చేశారు.

**కుస్తీకి వీడ్కోలు పలికి..రాజకీయ రంగ ప్రవేశం**

అంతేకాదు.. రాష్ట్ర క్రీడా విధానాన్ని అనుసరించి ఒలింపిక్స్‌లో రజతం గెలిచిన ఆటగాళ్లకు ఇచ్చే నజరానాను వినేశ్‌కు అందిస్తామనే హామీ అందింది. అయితే, ఆ తర్వాత పరిస్థితులు మారిపోయాయి. అనూహ్య రీతిలో పతకం చేజారిన చేదు అనుభవాన్ని జీర్ణించుకోలేక వినేశ్ ఫొగట్ కుస్తీకి వీడ్కోలు పలికి..రాజకీయ రంగ ప్రవేశం చేశారు. కాంగ్రెస్ పార్టీ నుంచి ఝులానా నియోజకవర్గంలో పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలిచిన ఆమె.. అసెంబ్లీలో అడుగు పెట్టారు. ఈ క్రమంలో క్రీడాకారుల కోటాలో తనకు అందాల్సిన నజరానా గురించి ఇటీవల విధాన సభలో ప్రస్తావించారు.


**హామీ మరిచారా?**

''వినేశ్ ఫొగట్ మా కూతురు. ఒలింపిక్ సిల్వర్ మెడలిస్ట్‌కు ఇచ్చే రివార్డును ఆమెకు అందజేస్తాం అని ముఖ్యమంత్రి గారు చెప్పారు. కానీ ఇంత వరకు ఆ హామీని పూర్తి చేయలేకపోయారు. ఇది కేవలం డబ్బుకు సంబంధించిన విషయం కాదు. గౌరవానికి సంబంధించిన అంశం. ఈ రాష్ట్రంలో చాలా మంది క్రీడాకారులకు ఇప్పటికే రివార్డులు అందజేశారు'' అని వినేశ్ ఫొగట్ బీజేపీ ప్రభుత్వ తీరును విమర్శించారు. ఈ నేపథ్యంలో మంగళవారం నాటి కేబినెట్ సమావేశంలో వినేశ్ ఫొగట్ రివార్డుకు సంబంధించి ముఖ్యమంత్రి నయాబ్ సింగ్ సైనీ నిర్ణయం తీసుకున్నారు. ''వినేశ్ ఫొగట్ ప్రస్తుతం ఎమ్మెల్యేగా ఉన్నారు. తన క్యాష్ రివార్డుకు సంబంధించిన అంశాన్ని ఆమె విధాన సభలో లేవనెత్తారు.

**ఈ మూడింటిలో ఏది కావాలి?**

అందుకే కేబినెట్ ప్రత్యేకంగా ఈ విషయంపై చర్చించింది. స్పోర్ట్స్ పాలసీ ప్రకారం ఆమెకు ప్రయోజనాలు చేకూర్చాలని నిశ్చయించింది'' అని తెలిపారు. నిబంధనల ప్రకారం.. రూ. 4 కోట్ల క్యాష్ ప్రైజ్.. లేదంటే ప్రభుత్వ ఉద్యోగం.. లేదా హర్యానా షహరీ వికాస్ ప్రాధికారణ్ పథకం కింద ప్లాట్.. ఈ మూడింటిలో ఏదో ఒకటి తీసుకోవాలని కేబినెట్ వినేశ్ ఫొగట్‌కు ఆఫర్ ఇచ్చింది. అయితే, ఆమె ఇంతవరకు స్పందించకపోవడం గమనార్హం. ఇక తాను తల్లి కాబోతున్నట్లు ఇటీవలే వినేశ్ ఫొగట్.. తన భర్త, రెజ్లర్ సోమ్‌వీర్ రాఠీతో కలిసి శుభవార్త పంచకున్న విషయం తెలిసిందే.

# 'కర్ర పట్టిన రాజ్యంలో.. నోరు గతేమిటి?'




ఒక పురాణ కథ చెప్పుకుందాం.. రుషుల కాలంలో అష్టావక్రుడు అనే గొప్ప పండితుడు ఉండేవాడు. ఆయన కురూపి. శరీర నిర్మాణం సరిగా లేనివాడు. అయితేనేం.. అపరిమిత జ్ఞాన సంపన్నుడు! అనేక శాస్త్రాల మీద పట్టు సంపాదించిన వాడు. ఒకసారి ఏమైందంటే.. ఒక రాజుగారి ఆస్థానంలో పండిత గోష్టి జరుగుతోంది. ఎక్కడెక్కడినుంచో దూరదేశాల నుంచి వచ్చిన మహా పండితులు అక్కడి చర్చల్లో పాల్గొంటున్నారు. ఆ సభకు అష్టావక్రుడు కూడా వచ్చాడు. 'ఎవరివయ్యా నువ్వు.. ఇక్కడకు ఎందుకు వచ్చావు..' అని అడిగారు రాజుగారు. అష్టావక్రుడు తన గురించి చెప్పుకుని.. పండిత గోష్టిలో పాల్గొనడానికే వచ్చాననే సంగతి వెల్లడించాడు. అలా కురూపిగా ఉన్న ఆయన ఆ మాట చెప్పగానే.. సభలో ఉన్నవాళ్లలో చాలామంది ఫక్కున నవ్వారు. అలాంటి అనాకారి తాను పండితుడినని చెప్పగానే వారికి నవ్వొచ్చింది మరి. ఆ వెంటనే అష్టావక్రుడు వెనుతిరిగి సభనుంచి వెళ్లిపోవడానికి ఉద్యుక్తుడయ్యాడు. రాజుగారు కంగారు పడ్డారు. తన ఆస్థనంలో సభ నుంచి ఒక పండితుడు అలా నిరసనగా తిరిగి వెళ్లిపోవడం తనకు అవమానం కదా అని భావించి, అతడిని వారించాడు. 'పండితుడా.. ఎందుకు వెళ్లిపోతున్నావు' అని అడిగాడు. అందుకు జవాబుగా అష్టావక్రుడు..

''చర్మంతో చెప్పులు కుట్టుకుని పనిచేసే వాళ్లు నిండిన సభలో నేను పాండిత్యం చూపను.. అది నాకు అవమానం..'' అని అన్నాడు. రాజుగారు ఖంగుతిన్నారు. ''అదేమిటి ఇందరు పేరుమోసిన పండితులు కూర్చుని ఉన్న సభ నీకు.. తోలు చెప్పులు కుట్టుకునే వాళ్ల కూటమిలా కనిపిస్తున్నదా'' అని కొంచెం కోపగించుకున్నారు కూడా!. అందుకు అష్టావక్రుడు.. ''రాజా నేను మిమ్మల్ని అవమానించాలని ఈ మాట అనలేదు. చర్మాన్ని చూసి విలువను లెక్కగట్టేవాళ్లు చెప్పులు కుట్టేవాళ్లే కదా..'' అని అన్నాడు.

తన ఆకారాన్ని చూసి పాండిత్యాన్ని ఎలా నిర్ణయిస్తారని చెప్పాడు. రాజు కూడా నొచ్చుకున్నాడు. సభలోని సాటిపండితులు కూడా మన్నింపు వేడుకున్నారు. ఆ తర్వాత అష్టావక్రుడు పండితగోష్టిలో పాల్గొనడమూ.. తన పాండిత్యానికి తిరుగులేదని నిరూపించుకోవడమూ జరిగింది. ఇదీ కథ. ఎందుకో.. కునాల్ కమ్రా కు జరిగిన, జరుగుతున్న పరాభవం, హెచ్చరిక, సత్కార ఛీత్కారాలు గమనిస్తోంటే.. ఈ అష్టావక్రుడి కథ గుర్తుకు వస్తోంది.

ఎలాంటి రాజ్యంలో బతుకుతున్నాం మనం..? ఒకడు కర్రపట్టుకుని కాపలా కూర్చుని.. ఈ దేశంలో ఎవడు ఏం మాట్లాడినా సరే.. నాకు నచ్చిన నాకు ప్రీతికరమైన మాటలు మాత్రమే మాట్లాడాలి? అని శాసించే రాజ్యంలో బతుకుతున్నామా? అసభ్యపు మాటలతో, బూతులతో ఏమైనా అంటే.. వాటిని నేరాలుగా పరిగణించడానికి చట్టాలున్నాయి. ఆ చట్టాలను దుర్వినియోగం చేయడం కూడా ఉంది. ఏదైనా సరే.. చట్టం అనే ముసుగులో జరుగుతోంది. చట్టాన్ని మీరిన పనులు చేసినప్పుడు.. అలా అనిపించిన పనులు జరిగినప్పుడు జరుగుతోంది.

మరి చట్టం పరిధిలోకి రానటువంటి.. సమకాలీన సంగతులను హాస్యస్ఫోరకంగా, ఆలోచింపజేసే చిరు వెక్కిరింతగా ప్రస్తావించే మాటలకు కూడా మహోద్రేకంతో రగిలిపోయి.. కర్రపట్టుకుని దండించి తీరుతాం అని బరితెగించే మూకలు రాజ్యం చేస్తున్న చోట మనం ఎన్నాళ్లు బతకగలం?. నాయకులు తమ గురించి గొప్పలు చెప్పుకునేప్పుడు.. గతచరిత్రలోని చిన్నస్థాయి నేపథ్యాలను చాలా గర్వంగా వల్లెవేసుకుంటూ ఉంటారు కదా..! అదే నేపథ్యాల గురించి ఒక వెక్కిరింత వస్తే.. ఎందుకంత ఉడికిపోతుంటారు? నోటికి వేసే తాళాలు తయారుచేసుకునే కంపెనీలకే ఇప్పుడు చెల్లుబాటు అయ్యే రోజులు. కర్ర పట్టుకుని కాపలా తిరుగుతూ ఉండే.. కిట్టని మాటలు వినిపిస్తే మూతులు పగలగొట్టాలని చూసే కర్రదండు రాజ్యం చేస్తున్న నేలమీద మనం ఎంతకాలం జీవించగలం? మాట్లాడే స్వేచ్ఛ ఈ దేశంలో ప్రతి మనిషికీ ఉన్నదని అనుకోవడం ఒక భ్రమే కదా? అందరికీ మాట్లాడే స్వేచ్ఛను ఇచ్చింది రాజ్యాంగం.. కానీ, కొందరికి కర్రపుచ్చుకుని దాడులు చేసి, చావచితగ్గొట్టే స్వేచ్ఛను ఇస్తున్నాయి ప్రభుత్వాలు!

-ఎం.రాజేశ్వరి

# అమిత్ షాపై సభా హక్కుల నోటీసు తిరస్కరణ



**న్యూఢిల్లీ:** కేంద్ర హోం మంత్రి అమిత్‌షాకు వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ సమర్పించిన సభా హక్కుల ఉల్లంఘన నోటీసులను గురువారం రాజ్యసభ చైర్మన్ జగ్‌దీప్ ధన్‌ఖడ్ తిరస్కరించారు. ఆయన వ్యాఖ్యలను పరిశీలించాను. అందులో అతిక్రమణ ఏదీ కనిపించలేదని చెబుతూ నోటీసులను తిరస్కరించారు. విపత్తుల నిర్వహణ బిల్లు 2024పై రాజ్యసభలో మంగళవారం జరిగిన చర్చలో అమిత్‌షా మాట్లాడుతూ ''కాంగ్రెస్ హయాంలో ప్రధానమంత్రి సహాయనిధి కేవలం ఒక కుటుంబం గుప్పిట్లో ఉండేదని, ప్రధానమంత్రి సహాయనిధిని ప్రభుత్వం ఏర్పాటు చేసినా అందులో కాంగ్రెస్ అధ్యక్షులు సభ్యులుగా ఉండేవారు'' అని వ్యాఖ్యానించారు. అయితే ఈ వ్యాఖ్యలు పరోక్షంగా సోనియా గాంధీ పరువు ప్రతిష్టలకు భంగం కలిగించేవిగా ఉన్నాయని, హోం మంత్రి సభ్యులను తప్పుదోవ పట్టించారని, ఇది సభా హక్కుల ఉల్లంఘన కిందకే వస్తుందని పేర్కొంటూ జైరాం రమేశ్ ప్రివిలేజ్ నోటీసు రాజ్యసభ చైర్మన్‌కు అందించారు.

# సోషల్




తమన్నాకు అభిమాని లేఖ
గౌరవనీయులైన తమన్నా
భాటియా గార్కి,
నమస్కరించి
వ్రాయునది.
ఉభయ
కుషలోపరి
ఇటీవల మీరు ఆ
హిందీ నటునీతో
తెగదెంపులు చేసుకున్నారని
వార్తా మధ్యమాల ద్వారా
తెలుసుకున్నాను.
మీ వద్ద మగ స్నేహితుని ఉద్యోగం
ఖాళీ గా ఉందని భావిస్తూ ఉన్నాను.
కావునా సదరు ఉద్యోగాన్ని ప్రేమ తో
నాకు ఇప్పించవలసినది గా కోరి
ప్రార్థిస్తున్నాను.
నిరంతరం శ్రమించి ,మీ మెప్పు
పొందగలవాడినని
తెలియజేసుకుంటున్నాను.
చిత్తగించవలెను.
ఇట్లు
తమ అభిమాని

**ఈ పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఎవరో నెటిజన్ చూపిన క్రియేటివిటీ ఎందరో వాల్స్ పై కనిపిస్తోంది.**



# నాలుగు నెలల్లో రూ.3,000 కోట్ల కలెక్షన్స్!

## బాక్సాఫీస్ క్వీన్‌గా రష్మిక



రష్మిక మందన్నా.. ఇండస్ట్రీ ఏదైనా ఆమె అడుగు పెడితే బ్లాక్ బస్టర్ వెల్ కమ్ చెపాల్సిందే. హీరో ఎవరైనా సరే.. ఆమె జోడి కడితే కెరీర్ లో బిగ్ హిట్ అందుకోవాల్సిందే. అలా అని మహానటి పేరు లేదు. గ్లామర్ క్వీన్ అనే క్రేజ్ కూడా లేదు. టోటల్‌గా లక్ ఫ్యాక్టర్ బాక్సాఫీస్ దగ్గర మ్యాజిక్ చేస్తోంది. ఇండియన్ సినిమాలో తనని తిరుగులేని నటిగా నిలబెడుతోంది. రికార్డులకు కేరాఫ్ అడ్రస్‌గా మారుతోంది.

### నాలుగు నెలల్లో మూడు వేల కోట్లు!

రష్మిక కథానాయికగా నటించిన పుష్ప 2 గతేడాది డిసెంబర్‌లో రిలీజ్ అయింది. ఈ మూవీతో 1800 కోట్ల వసూళ్లు. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఛావా రిలీజ్.. 800 కోట్ల కలెక్షన్స్. అంటే ఏడాదిలోపే, 2600 కోట్ల వసూళ్లు. ఇప్పుడు ఈద్‌కు మరో బాలీవుడ్ ఫిలిం సికిందర్ సినిమా రిలీజ్ అవుతోంది. ఎంత లేదనుకున్నా ఈద్ సమయంలో సల్మాన్ సినిమా అంటే ఈజీగా మూడు నాలుగు వందల కోట్లు కొల్లగొడుతుంది. కేవలం నాలుగు నెలల వ్యవధిలో మూడు వేల కోట్ల వసూళ్లకు రష్మిక కేరాఫ్ అడ్రస్‌గా మారనుంది అనేది సంచలనం సృష్టిస్తోంది.

### దేశ సినీచరిత్రలోనే..

బాలీవుడ్‌ను ఏళ్లకు ఏళ్లు ఏలిన దీపిక, ఆలియా భట్, కత్రినాకైఫ్‌కు కూడా ఇలాంటి రికార్డ్ లేదు. భవిష్యత్తులో వారు అందుకునే ఛాన్స్ కూడా లేదు. వీటికి అంతకు ముందు రష్మిక నటించిన ఆల్ టైమ్ బ్లాక్ బస్టర్ యానిమల్ కలెక్షన్స్ కూడా కలుపుకుంటే హిందీ ఇండస్ట్రీలో రష్మిక కలెక్షన్స్ రికార్డ్ రూ.3500 కోట్లు దాటుతుంది. ఇండియన్ ఫిల్మ్ ఇండస్ట్రీలో మరే హీరోయిన్‌కు ఈ స్థాయి బ్లాక్ బస్టర్స్ లేవు. ఈ రేంజ్ కలెక్షన్స్ లేవు. అందుకే రష్మిక నేమ్ అంత స్పెషల్ గా మారింది. బాలీవుడ్ లేటెస్ట్ బాక్సాఫీస్ క్వీన్ అనిపించుకుంటోంది.

### కొంత కష్టం.. కొంత అదృష్టం

కెరీర్ బిగినింగ్ నుంచి రష్మికకు లక్ ఫ్యాక్టర్ ఎక్కువ. పైగా కష్టపడం ఈ హీరోయిన్‌కు మరింత ఇష్టం. అందుకే ఇంత అందలం. ఆకాశమే హద్దుగా స్టార్ డమ్. ఒక్క బ్లాక్ బస్టర్ అందివస్తేనే కెరీర్ పరుగులు పెడుతుంది. అలాంటిది బాలీవుడ్‌లో రష్మికపై బ్లాక్ బస్టర్స్ వర్షం కురుస్తోంది. హిట్ మీద హిట్, రికార్డుల మీద రికార్డులు వస్తున్నాయి, పడుతున్నాయి. సికందర్‌లో తనకంటే 31 ఏళ్ల పెద్ద వయసు ఉన్న సల్మాన్ ఖాన్‌తో ఆడిపాడింది రష్మిక. ఇక్కడ కూడా మంచి మార్కులే వేయించుకుంది. తనదైన నటనతో సల్మాన్ మనసు గెల్చుకుంది. అందుకే భాయ్ జాన్.. ఏజ్ గ్యాప్‌పై ఓపెన్ అయిపోయాడు. రష్మికకు, వాళ్ల ఫాదర్ కు లేని ఇబ్బంది మిగతా వాళ్లకు ఎందుకని ప్రశ్నించాడు. సికిందర్ తర్వాత కూడా మరిన్ని క్రేజీ మూవీస్ చేయబోతోందీ బ్యూటీ.

# హైదరాబాద్ వ్యాపారవేత్త కుమార్తెతో ప్రభాస్ పెళ్లి?

## బలంగా రూమర్లు.. స్పందించని ప్రభాస్

### పెళ్లి పీటలు ఎక్కితే చూడాలని కోట్లాది మంది ఫ్యాన్స్ ఎదురు చూపులు

**మహా:** బాహుబలి ప్రభాస్ పెళ్లిపై ఎప్పుడూ ఏదో ఒక రూమర్ వినిపిస్తూనే ఉంటుంది. ఆరడుగుల అందగాడు పెళ్లి పీటలు ఎక్కితే చూడాలని కోట్లాది మంది ఫ్యాన్స్ ఎదురు చూస్తున్నారు. హైదరాబాద్ ప్రముఖ వ్యాపారవేత్త కుమార్తెతో పెళ్లి ఫిక్స్ అయిందన్న రూమర్స్ బలంగా వినబడుతున్నాయి. ఆ అమ్మాయి తండ్రికి హైదరాబాద్ లో పలు వ్యాపారాలు ఉన్నాయని.. ఏపీకి చెందిన వీరి ఫ్యామిలీ హైదరాబాద్ లో సెటిల్ అయిందంటూ వార్తలు వస్తున్నాయి. ఈ వార్తలు ఇంత బలంగా రావడానికి మరో కారణం కూడా ఉంది. రీసెంట్ గా ప్రభాస్ అన్ స్టాపబుల్ షోకు వచ్చినప్పుడు రామ్ చరణ్ ఓ హింట్ ఇచ్చాడు. ఏపీలోని గణపవరానికి చెందిన ఓ అమ్మాయితో ప్రభాస్ పెళ్లి అంటూ ఆయన చెప్పాడు. ఆయన చెప్పినట్టే ఈ సంబంధం వివరాలు ఉన్నాయని.. ఇది కన్ఫర్మ్ అంటూ వార్తలు వస్తున్నాయి. అయితే గతంలోనూ ఇలా చాలాసార్లు రూమర్స్ రాగా, ప్రభాస్ ఫ్యామిలీ స్పందిస్తేనే అసలు విషయం తెలుస్తుంది.

## క్రీడా వార్తలు SPORTS NEWS



# 13 బంతుల్లో విధ్వంసం

## ఎస్ఆర్‌హెచ్ నయా హీరో!


### ఎవరీ అనికేత్?

ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు మరో కొత్త హిట్టర్ దొరికేశాడు. అతడు యువ ఆటగాడు అనికేత్ వర్మ. ఐపీఎల్ 2025లో భాగంగా ఉప్పల్ వేదికగా లక్నో సూపర్ జెయింట్స్‌తో జరిగిన మ్యాచ్‌లో అనికేత్ వర్మ మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. ఆరో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చిన అనికేత్.. ప్రత్యర్థి బౌలర్లపై విరుచుకుపడ్డాడు. కేవలం 13 బంతులు మాత్రమే ఎదుర్కొన్న అనికేత్.. 5 సిక్స్‌లతో 36 పరుగులు చేశాడు. ఎస్ఆర్‌హెచ్ లక్నో ముందు ఫైటింగ్ స్కోర్ ఉంచడంలో అనికేత్‌ది కీలక పాత్ర. ఈ క్రమంలో ఎవరీ అనికేత్ అని నెటిజన్లు తెగవేతికేస్తున్నారు.

**ఎవరీ అనికేత్ వర్మ..?**

23 ఏళ్ల అనికేత్ వర్మ.. ఫిబ్రవరి 5, 2002న ఉత్తరప్రదేశ్‌లోని ఝాన్సీలో జన్మించాడు. కానీ అతడు దేశవాళీ క్రికెట్ లో మాత్రం మధ్యప్రదేశ్ తరపున ఆడుతున్నాడు. కుడిచేతి వాటం బ్యాటర్ అయిన వర్మ.. పవర్ హిట్టింగ్‌కు పెట్టింది పేరు. మీడియం పేస్ బౌలింగ్ కూడా చేయగలడు. అనికేత్ వర్మ ఇప్పటికే దేశవాళీ క్రికెట్ లో తనను తను నిరూపించుకున్నాడు. ఫెయిత్ క్రికెట్ క్లబ్ తరపున 44 బంతుల్లో 120 చేసిన వర్మ.. మధ్యప్రదేశ్ లీగ్ (MPL) టీ20 లీగ్‌లో కేవలం 41 బంతుల్లో 123 పరుగులు చేశాడు. అదేవిధంగా పురుషుల అండర్23 స్టేట్ A ట్రోఫీలో సైతం ఆజేయ సెంచరీతో మెరిశాడు. ఈ క్రమంలోనే అతడిని ఐపీఎల్ 2025 మెగా వేలంలో రూ. 30 లక్షల బేస్ ప్రైస్‌కు సన్‌రైజర్స్ కొనుగోలు చేసింది. ఇక ఈ మ్యాచ్‌లో టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు దిగిన ఎస్ఆర్‌హెచ్ 9 వికెట్ల నష్టానికి 190 పరుగులు చేసింది. లక్నో బౌలర్లు అద్భుతంగా రాణించారు. లక్నో పేసర్ శార్దూల్ ఠాకూర్ నాలుగు వికెట్లతో చెలరేగాడు. అతడితో పాటు ప్రిన్స్ యాదవ్, దిగ్వేష్, రవి బిష్ణోయ్, ప్రిన్స్ యాదవ్ తలా వికెట్ సాధించారు. ఎస్ఆర్‌హెచ్ బ్యాటర్లలో ట్రావిస్ హెడ్(47) పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలవగా.. అనికేత్ వర్మ(36), నితీశ్ కుమార్ రెడ్డి(32), క్లాసెన్(26) రాణించారు.

# రియాన్ పరాగ్ చెత్త రికార్డు.. తొలి ప్లేయర్‌గా



ఐపీఎల్ 2025లో రాజస్తాన్ రాయల్స్ వరుసగా రెండో మ్యాచ్‌లో ఓటమి చవిచూసింది. గౌహతి వేదికగా కోల్‌కతా నైట్‌రైడర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 8 వికెట్ల తేడాతో రాజస్తాన్ పరాజయం పాలైంది. అంతకుముందు సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన మొదటి మ్యాచ్‌లోనూ రాజస్తాన్‌ది ఇదే కథ. ఈ మ్యాచ్‌లో 44 పరుగుల తేడాతో రాయల్స్‌ను ఎస్ఆర్‌హెచ్ చిత్తు చేసింది. అయితే ఈ రెండు మ్యాచ్‌ల్లోనూ రెగ్యూలర్ కెప్టెన్ సంజూ శాంసన్ లేని లోటు స్పష్టంగా కన్పించింది. శాంసన్ చేతి వేలి గాయం కారణంగా మొదటి మూడు మ్యాచ్‌లకు దూరమయ్యాడు. అతడి స్థానంలో యువ బ్యాటర్ రియాన్ పరాగ్ రాజస్తాన్ జట్టుకు సారథ్యం వహిస్తున్నాడు. సంజూ ఇంపాక్ట్ ప్లేయర్‌గా కేవలం బ్యాటింగ్‌కు మాత్రమే వస్తున్నాడు. రియాన్ పరాగ్ మాత్రం కెప్టెన్సీ పరంగా పూర్తిగా తేలిపోయాడు. మైదానంలో వ్యూహాత్మకంగా వ్యవహరించలేకపోతున్నాడు. ఈ క్రమంలో పరాగ్ ఓ చెత్త రికార్డును తన పేరిట లిఖించుకున్నాడు. ఐపీఎల్‌లో వరుసగా రెండు మ్యాచ్‌ల్లో ఓటమి చవిచూసిన తొలి రాజస్తాన్ కెప్టెన్‌గా పరాగ్ నిలిచాడు. ఇప్పటివరకు ఏ రాజస్తాన్ కెప్టెన్ కూడా వరుసగా రెండు మ్యాచ్‌ల్లో ఓటమి చవిచూడలేదు. రాజస్తాన్ ఫ్రాంచైజీకి పరాగ్ ఏడువ కెప్టెన్ కావడం గమనార్హం. పరాగ్ కంటే ముందు షేన్ వార్న్, షేన్ వాట్సన్, రాహుల్ ద్రవిడ్, స్టీవ్ స్మిత్, అజింక్య రహానే, సంజు శాంసన్ రాయల్స్‌కు కెప్టెన్‌లగా వ్యవహరించారు. మరో మ్యాచ్ తర్వాత సంజూ తిరిగి రాజస్తాన్ పగ్గాలు చేపట్టే అవకాశముంది.

## ఐపీఎల్-2025లో ఆసక్తికర విషయం

# వాళ్లే హీరోలయ్యారు..!



ఐపీఎల్ 2025 సీజన్‌లో ఇప్పటివరకు (మార్చి 26) ఆరు మ్యాచ్‌లు పూర్తయ్యాయి. ఇందులో తొలి ఐదు మ్యాచ్‌లు ధనాధన్ బ్యాటింగ్ విన్యాసాలతో సాగగా.. నిన్న జరిగిన ఆరో మ్యాచ్ ఎలాంటి మెరుపులు లేకుండా చప్పగా ముగిసింది. ఈ సీజన్‌లో ఇప్పటివరకు జరిగిన ఆరు మ్యాచ్‌ల్లో ఓ ఆసక్తికర విషయం చోటు చేసుకుంది. ఆరు మ్యాచ్‌ల్లో ఫ్రాంచైజీలు మారి వచ్చిన ఆటగాళ్లే తమ కొత్త జట్లను గెలిపించారు. సీజన్ తొలి మ్యాచ్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ కేకేఆర్‌పై ఆర్సీబీ విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో ఆర్సీబీ గెలుపులో లక్నో నుంచి వలస వచ్చిన కృనాల్ పాండ్యా కీలకపాత్ర పోషించాడు. కృనాల్ ఆర్సీబీ తరఫున తన తొలి మ్యాచ్‌లోనే మ్యాచ్ విన్నింగ్ పెర్ఫార్మెన్స్ ఇచ్చాడు. ఈ మ్యాచ్‌లో అతను 4 ఓవర్లలో 29 పరుగులిచ్చి 3 వికెట్లు తీశాడు. ఫలితంగా ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు గెలుచుకున్నాడు. సీజన్ రెండో మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్‌పై సన్‌రైజర్స్ హైదరాబాద్ విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో ఇషాన్ కిషన్ విధ్వంసకర సెంచరీ చేసి సన్‌రైజర్స్ విజయంలో ప్రధానపాత్ర పోషించాడు. గత సీజన్ వరకు ముంబై ఇండియన్స్‌కు ఆడిన ఇషాన్.. సన్‌రైజర్స్ తరఫున తన తొలి మ్యాచ్‌లోనే మ్యాచ్ విన్నింగ్ ఇన్నింగ్స్ ఆడి ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు గెలుచుకున్నాడు. మూడో మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్‌పై చెన్నై సూపర్ కింగ్స్ విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో ముంబై బ్యాటింగ్ లైనప్‌కు కుప్పకూల్చిన నూర్ అహ్మద్ సీఎస్‌కే గెలుపులో కీలకంగా వ్యవహరించాడు. గత సీజన్ వరకు గుజరాత్ టైటాన్స్‌కు ఆడిన నూర్.. సీఎస్‌కే తరఫున తన తొలి మ్యాచ్‌లోనే అద్భుత ప్రదర్శన చేసి ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా నిలిచాడు. సీజన్ నాలుగో మ్యాచ్‌లో లక్నో సూపర్ జెయింట్స్‌పై ఢిల్లీ క్యాపిటల్స్ అద్భుత విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో ఆశుతోష్ శర్మ అద్భుతమైన బ్యాటింగ్ విన్యాసాలు ప్రదర్శించి ఢిల్లీకి ఊహించని విజయాన్నందించాడు. గత సీజన్‌లో పంజాబ్‌కు ఆడిన అశుతోష్.. ఢిల్లీ తరఫున తొలి మ్యాచ్‌లోనే అదగొట్టాడు. ఫలితంగా ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు గెలుచుకున్నాడు. ఐదో మ్యాచ్‌లో గుజరాత్‌పై పంజాబ్ సూపర్ విక్టరీ నమోదు చేసింది. ఈ మ్యాచ్‌లో శ్రేయస్ అయ్యర్ సెంచరీ త్యాగం చేసి మరీ తన కొత్త ఫ్రాంచైజీ పంజాబ్‌ను గెలిపించాడు. గత సీజన్‌లో కేకేఆర్‌కు టైటిల్ అందించిన శ్రేయస్.. పంజాబ్ తరఫున తన తొలి మ్యాచ్‌లో వీరంగం సృష్టించాడు. ఫలితంగా ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా నిలిచాడు. నిన్న జరిగిన ఆరో మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్‌పై కేకేఆర్ గెలుపొందింది. ఈ మ్యాచ్‌లో కేకేఆర్‌ను డికాక్ ఒంటిచేత్తో గెలిపించాడు. గత సీజన్‌లో లక్నోకు ఆడిన డికాక్.. కేకేఆర్ తరఫున తన రెండో మ్యాచ్‌లోనే అదరగొట్టి ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా ఎంపికయ్యాడు.

# అశ్విన్, చహల్‌ను వదులుకొని రాయల్స్ తప్పు చేసిందా..?



ప్రస్తుత ఐపీఎల్ సీజన్‌లో రాజస్థాన్ రాయల్స్ వరుసగా రెండు మ్యాచ్‌ల్లో ఓటమిపాలై పాయింట్ల పట్టికలో చివరి స్థానంలో ఉంది. తొలి మ్యాచ్‌లో సన్‌రైజర్స్ చేతిలో పరాజయం ఎదుర్కొన్న ఆ జట్టు.. నిన్న (మార్చి 26) ఆడిన రెండో మ్యాచ్‌లో కేకేఆర్ చేతిలో చావుదెబ్బ తినింది. ఈ సీజన్‌లో రాయల్స్ వరుసగా రెండు పరాజయాలు ఎదుర్కోవడానికి ప్రధాన కారణం వారి జట్టు. గత సీజన్‌తో పోలిస్తే ఈ సీజన్‌లో వారి జట్టు చాలా బలహీనంగా ఉంది. బ్యాటింగ్‌లో పర్వాలేదనిపిస్తున్నా బౌలింగ్‌లో మాత్రం దారుణంగా ఉంది. గత సీజన్ వరకు వారి విజయాల్లో కీలకపాత్ర పోషించిన రవిచంద్రన్ అశ్విన్, యుజ్వేంద్ర చహల్, ట్రెంట్ బౌల్ట్‌ను వదులుకుని రాయల్స్ పెద్ద తప్పు చేసింది. వీరి ప్రత్యామ్నాయంగా వచ్చిన బౌలర్లు పెద్దగా ప్రభావం చూపలేకపోతున్నారు. రాయల్స్ యాష్, చహల్‌కు ప్రత్యామ్నాయంగా లంక స్పిన్ ద్వయం మహీశ్ తీక్షణ, వనిందు హసరంగలను అక్కున చేర్చుకుంది. వీరు మంచి బౌలర్లే అయినా యాష్, చహల్ అంత ప్రభావం చూపలేకపోతున్నారు. తొలి రెండు మ్యాచ్‌ల్లోనే ఈ విషయం తేలిపోయింది. రాయల్స్ మరో ఇన్ ఫామ్ పేసర్ ఆవేశ్ ఖాన్‌ను కూడా వదిలేసి మూల్యం చెల్లించుకుంటుంది. బౌల్ట్ స్థానాన్ని భర్తీ చేస్తాడనుకున్న జోఫ్రా ఆర్చర్ గల్లీ బౌలర్ కంటే దారుణంగా తయారయ్యాడు. సన్‌రైజర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ఆర్చర్ ఏకంగా 76 పరుగులిచ్చాడు (4 ఓవర్లలో). జట్టులోకి కొత్తగా వచ్చిన ఆఫ్ఘనిస్తాన్ యువ పేసర్ ఫజల్ హక్ ఫారూకీ ఏం చేస్తున్నాడో అతనికే తెలియడం లేదు. అనుభవజ్ఞుడైన సందీప్ శర్మలో మునుపటి జోరు కనిపించడం లేదు. కొత్తగా వచ్చిన దేశీయ పేసర్ తుషార్ దేశపాండే ఒక్కడే కాస్త పర్వాలేదనిపిస్తున్నాడు. మొత్తంగా చూస్తే ఈ సీజన్‌లో అశ్విన్, చహల్, బౌల్ట్ లేని లోటు రాయల్స్‌లో స్పష్టంగా కనిపిస్తుంది. ప్రస్తుత బౌలింగ్ యూనిట్‌తో రాయల్స్ ఏ మేరకు రాణిస్తుందో వేచి చూడాలి. బ్యాటింగ్‌నే నమ్ముకొని అద్భుతాలు చేద్దామన్నా, ఈ సీజన్‌లో రాయల్స్ బ్యాటర్లు ఫామ్‌లో ఉన్నట్లు కనిపించడం లేదు. తొలి మ్యాచ్‌లో జురెల్, శాంసన్ పర్వాలేదనిపించినా రెండో మ్యాచ్‌లో వారిద్దరూ తేలిపోయారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com